## ఆపరేషన్ సిందూర్.. ఆల్ పార్టీ మీటింగ్...

పెహల్‌గామ్ ఉగ్రదాడికి 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ ప్రతీకారం తీర్చుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రేపు అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చింది. రేపు ఉదయం 11 గంటలకు ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తాజాగా తెలిపాయి. ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హెూం మంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సహా సీనియర్ మంత్రులు పాల్గొంటారు.ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ గురించి ప్రతిపక్ష నాయకులకు వివరించనున్నారు. అదేవిధంగా జాతీయ భద్రత విషయాలపై కూడా చర్చించనున్నట్లు తెలిసింది. మరోవైపు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కలిశారు. బుధవారం మధ్యాహ్నం రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్న ప్రధాని.. ముర్ముతో కాసేపు భేటీ అయ్యారు. పాక్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. సరిహద్దు వద్ద తాజా పరిస్థితి, ప్రభుత్వ చర్యలను రాష్ట్రపతి ముర్ముకు వివరించారు.

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :65 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 08-05-2025 | పేజీలు:4 వెల: 2.00

## 25 నిమిషాలు.. 24 మిస్సైల్ దాడులు.. ఉగ్రస్థావరాలపై భారత్ దాడులు



న్యూఢిల్లీ, గత నెల 22న జమ్ము కశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లోగల మినీస్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. పర్యాటకుల లక్ష్యంగా ఉగ్రమూక కాల్పులకు తెగబడింది. మతం అడిగి మరీ 26 మంది పురుషలను పొట్టన పెట్టుకుంది. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోవాలంటూ డిమాండ్లు వెల్లువెత్తాయి. దీంతో తాజాగా పాక్‌పై భారత్ ప్రతీకార దాడి చేసింది.మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావ'రాలే లక్ష్యంగా భారత్ విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' (ఆపరేషన్ సిందూర్) పేరుతో మెరుపుదాడి చేసింది. మొత్తం 9 టెర్రర్ కేంద్రాలను ఇండియా టార్గెట్ చేసింది. కేవలం 25 నిమిషాల్లోనే ఆ ఉగ్రస్థావరాలపై 24 మిస్సైళ్లతో మెరుపు దాడి చేసి పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది.ఈ దాడిలో 80 మందిపైగా ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. అంతకంటే ఎక్కువ సంఖ్యలోనే ప్రాణాలు కోల్పోయి ఉంటారని అంచనా. అయితే, కచ్చితమైన సమాచారం లేదు.

భారత్ టార్గెట్ చేసిన తొమ్మిది స్థావరాలు ఇవే..

బహ'వల్‌పుర్.. జైషే ఈ మొహమ్మద్ ప్రధాన కార్యాలయం

పాకిస్థాన్‌లోని పంజాబ్‌లో బహవల్పూర్ ఉంది. ఈ ఆపరేషన్‌లో ఇదే ప్రధాన లక్ష్యం. జైషే ఈ మొహమ్మద్ ప్రధాన కార్యాలయం ఈ సిటీలోనే ఉంది. ఆ ఉగ్ర సంస్థకు మసూద్ అజార్ నేతృత్వం వహిస్తున్నారు. ఇండియాలో జరిగిన అనేక ఉగ్ర దాడులకు ఆ సంస్థతో లింక్ ఉంది. 2001లో పార్లమెంట్‌పై జరిగిన దాడి, పుల్వామా సూసైడ్ బాంబింగ్‌కు లష్కరే సంస్థ ప్రధాన కారణం.

ముర్దికే.. లష్కరే తోయిబా బేస్ క్యాంపు.. శిక్షణ కేంద్రం

లాహెూర్‌కు ఉత్తరం వైపున 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. లష్కరే తోయిబాకు ఇదో ముఖ్య కేంద్రం. ఇక్కడే లష్కరే కు చెందిన జమాత్ ఉద్ దవా వింగ్ ఉంది. సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ముర్దికే క్షేత్ర శిక్షణ ప్రాంతాలు, లాజిస్టిక్ సపోర్టు కేంద్రాలు, ఉపదేశ కేంద్రాలు ఉన్నాయి. 2008 ముంబై దాడులకు చెందిన ఉగ్ర శిక్షణ ఇక్కడే జరిగినట్లు నిర్ధారించారు.


కోటీ.. బాంబార్ ట్రైనింగ్, టెర్రర్ లాంచ్ బేస్

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కోటీ కేంద్రం ఉంది. సూసైడ్ బాంబార్లు, చొరబాటుదారులకు ఇక్కడే శిక్ష జరుగుతుంది. ఇక్కడ ఒకేసారి 50 మంది ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చే సామర్థ్యం ఉన్న వసతులు ఉన్నాయి.గుల్‌పూర్.. రాజౌరీ, పూంచ్ జిల్లాలో జరిగే దాడులకు ఈ కేంద్రం లాంచ్‌ప్యాడ్‌లా పనిచేస్తుంది. జమ్మూకశ్మీర్‌లోని ఆ రెండు జిల్లాల్లో జరిగే దాడులకు గుల్‌పూర్‌ను ఉగ్రవాదులు కేంద్రంగా మార్చుకున్నట్లు పేర్కొన్నారు. 2023, 2024 సంవత్సరాల్లో ఇక్కడ నుంచే ఎక్కువ దాడులు జరిగాయి. భారతీయ భద్రతా కాన్వాయ్‌లు, కేంద్రాలను ఇక్కడ నుంచి ఉగ్రవాదులు టార్గెట్ చేసిన పౌరులు.సవాయి.. కశ్మీర్ లోయల్లో జరిగే దాడులకు ఇక్కడ ఉన్న లష్కరే క్యాంపుకు లింక్ ఉంది. ఉత్తర కశ్మీర్‌లో జరిగే దాడులకు సవాయి క్యాంపుతో లింక్ ఉన్నట్లు పేర్కొన్నారు. సోన్‌మార్గ్, గుల్‌మార్గ్, పెహల్గామ్‌లో జరిగే దాడుల్లో సవాయి ఉగ్ర క్యాంపుతో లింక్ ఉంది.సర్జల్, బర్నాలా.. చొరబాటుదారులకు ఇవి కేంద్రాలు.. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖకు దగ్గరగా ఉన్నాయి. సర్జల్, బర్నాలా కేంద్రాలు.. చొరబాటుదారులకు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయి.మెహమూనా ఉగ్ర కేంద్రం.. హిజ్బుల్ ముజాహిద్దిన్ ఇక్కడ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. సియాల్‌కోట్ కు సమీపంలో ఈ క్యాంపు ఉంది. ఉగ్ర సంస్థ హిజ్బుల్ ముజాహిద్దిన్ దీన్ని వాడుతున్నది. కశ్మీర్‌లో చాన్నాళ్ల నుంచి ఈ క్యాంపు యాక్టీవ్‌గా ఉంది. నిజానికి ఈ గ్రూపు ప్రస్తుతం తన కార్యకలాపాలను తగ్గించినా.. దాని ఆనవాళ్లు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.బిలాల్ క్యాంపు.. జేషే మొహమ్మద్‌కు చెందిన మరో ల్యాంచ్‌ప్యాడ్ ఇది. దీన్ని కూడా గ'త రాత్రి దాడిలో ధ్వంసం చేశారు. చొరబాటుకు పాల్పడడానికి ముందు ఉగ్రవాదులు ఇక్కడే బస చేస్తారు. భారతీయ భూభాగంలోకి చొరబాడేందుకు ఈ క్యాంపును తుది ట్రాన్సిట్ పాయింట్‌గా భావిస్తున్నారు.

## ఉగ్రవాద స్థావరాలను నాశనం చేయడమే భారత్ లక్ష్యం..

న్యూఢిల్లీ, హల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత మంగళవారం రాత్రి పాకిస్తాన్ పై భారత్ ఎయిర్ స్ట్రైక్స్ చేసింది. దీనికి భారత సైన్యం దీనికి 'ఆపరేషన్ సింధూర్' అని పేరు పెట్టింది.

ఈ దాడులపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ సింగ్ స్పందించారు. ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.. భారతదేశం ఈ ప్రతీకార చర్యల్లో పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది అన్నారు. ఆపరేషన్ సింధూర్ పాకిస్తాన్‌లోని ఏ సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకోలేదు అన్నారు. భారత్ పై దాడులు జరపడానికి ప్లాన్ చేసిన ఉగ్రవాద స్థావరాలను నాశనం చేయడమే ఈ దాడుల లక్ష్యం అని రాజ్ నాథ్ సింగ్ వెల్లడించారు.ఇక, పూర్తి స్థాయిలో ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా ఈ దాడులు కొనసాగుతాయని కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా 'భారత్ మాతా కీ జై' అని రాసుకొచ్చారు. మరోవైపు, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా 'జై హింద్! జై హింద్ కీ సేన' అంటూ భారత సైన్యాన్ని



ప్రశంసించారు. కోట్లి, బర్నాలా క్యాంప్, సర్జల్ క్యాంప్, మహ్మూ నా క్యాంప్, పీఓకేలోని బిలాల్, పాకిస్థాన్‌లోని మురిద్కే, బహవల్పూర్, గుల్పూర్, సవాయ్ క్యాంప్ లపై ఇండియన్ ఆర్మీ దాడులు చేసింది.

## ప్రధాని మోడీ పర్యవేక్షణలోనే ఆపరేషన్ సింధూర్..



న్యూఢిల్లీ, పాకిస్తాన్ పై దాడులు తప్పవని ఇండియన్ గవర్నమెంట్ గత కొన్ని రోజులుగా చెబుతునే వస్తుంది. అన్నట్లుగానే మంగళవారం అర్ధరాత్రి పాకిస్తాన్ లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం దాడులకు దిగింది.మొత్తం 9 ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని విజయవంతంగా ధ్వంసం చేసింది. దీనికి పాకిస్తాన్ సైన్యం కూడా స్పందించింది. భారత దాడులు అనంతరం సరిహద్దుల వెంబడి కాల్పులకు దిగింది. ఈ కాల్పులకు భారత ఆర్మీ కూడా ధీటుగా కౌంటర్ ఇచ్చింది. దీంతో ఎల్ఓసీ వెంబడి ఉద్రిక్త వాతావరణం కొనసాగుతుంది. మరో వైపు సరిహద్దుల్లో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధమైతుంది వాయు రక్షణ వ్యవస్థ.అయితే, ఈ మొత్తం ఆపరేషన్ ను భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. రాత్రంతా వార్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. భారత ఆర్మీకి సపోర్టుగా నిలిచారు. ఇక, ఉగ్రవాద శిబిరాలపై దాడుల వివరాలను భారత ఉన్నతాధికారులు ప్రపంచ దేశాలకు తెలియజేశారు. అమెరికా, రష్యా, బ్రిటన్, సౌదీ అరేబియా, యూఏఈకి సమాచారం ఇచ్చారు. ఆపరేషన్ సింధూర్ పై వాషింగ్టన్ డీసీలోని భారత ఎంబసీ ప్రకటన రిలీజ్ చేసింది. పాక్ పౌరులు, ఆర్థిక, సైనిక స్థావరాలపై దాడి చేయలేదని వెల్లడించారు. అమెరికా భద్రతా సలహాదారు మార్కో రూబియోతో భారత భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ మాట్లాడారు. దాడిపై అతడికి అన్ని విషయాలను వివరించారు.

## ఆపరేషన్ సిందూర్ పై ఒవైసీ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించింది. మర్కజ్ సుభాన్ అల్లా బహవల్పూర్, మర్కజ్ తైబా, మురిద్కే, సర్జల్ / టెహ్రా కలాన్, మెహమూనా జోయా ఫెసిలిటీ, సియాల్‌కోట్, మర్కజ్ అహ్లే హదీస్ బర్నాలా, భీంబర్, మర్కజ్ అబ్బాస్, కోట్లి, మస్కర్ రహీల్ షాహిద్, ముజఫరాబాద్‌లోని షావాయి నల్లా క్యామ్, మర్కజ్ సయ్యద్నా బిలాల్ లో మెరుపు దాడులు చేసింది.భారత్ చేపట్టిన ఈ ప్రతీకార చర్యకు 'ఆపరేషన్ సింధూర్' అని పేరు పెట్టారు. పాక్ పై భారత్ వైమానిక దాడులపై అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు.AIMIM అధినేత అసదుద్దీన్ ఒవైసీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. భారతదేశం తీసుకున్న ఈ చర్యను అసదుద్దీన్ ఒవైసీ ప్రశంసించారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మన రక్షణ దళాలు నిర్వహించిన సర్జికల్ దాడులను నేను స్వాగతిస్తున్నాను అని అసదుద్దీన్ ఒవైసీ పోస్ట్‌లో రాశారు. మరో పహల్గామ్



ఘటన మళ్లీ జరగకుండా పాకిస్తాన్ లోతైన రాజ్యానికి గట్టి గుణపాఠం నేర్పించాలి. పాకిస్తాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పూర్తిగా నాశనం చేయాలి. జై హింద్! అంటూ వెల్లడించారు.

## ఆపరేషన్ సింధూర్.. ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా ఉగ్రవాదులపై భారత సైన్యం మెరుపుదాడులు కొనసాగుతున్న తరుణంలో, హైదరాబాద్ వ్యూహాత్మకంగా కీలక ప్రాంతంగా ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు.ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అత్యవసర సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమీక్షలో ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సహా ఇతర కీలక విభాగాల ఉన్నతాధికారులు హాజరవుతారు. తాజా పరిస్థితులను పరిగణలోకి తీసుకుని అన్ని విభాగాలకు అప్రమత్తత, సమన్వయంపై సీఎం దిశానిర్దేశాలు ఇవ్వనున్నారు.ఇదే సందర్భంలో ఢిల్లీలో ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఫోన్ చేసి వెంటనే హైదరాబాద్ చేరుకోవాలని సీఎం సూచించినట్లు సమాచారం. దేశ రక్షణకు సంబంధించి హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉండటంతో, కేంద్రంతో సమన్వయానికి రాష్ట్ర స్థాయిలో పూర్తిస్థాయి సిద్ధత అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. సాయంత్రం



జరగనున్న మాక్ డ్రిల్‌ను కూడా సీఎం రేవంత్ స్వయంగా పర్యవేక్షించనున్నారు. ఏ చిన్న అనూహ్య పరిణామాలకైనా రాష్ట్ర యంత్రాంగం సిద్ధంగా ఉండేలా సీఎం చర్యలు తీసుకుంటున్నారు.

## భారత్ మెరుపు దాడులు.. బిత్తరపోయిన పాక్ ప్రధాని




ఇస్లామాబాద్: భారత్ దాడులను పాకిస్తాన్ సైన్యం ధ్రువీకరించింది. పాక్ డీజీ ఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరీ రియాక్ట్ అయ్యారు.పాక్‌లోని కొట్లీ, మురిద్కే, బహవల్పూర్, ముజఫరాబాద్ ఏరియాల్లో ఈ దాడులు కొనసాగినట్లు పేర్కొనింది. ఈ దాడుల్లో ముగ్గురు చనిపోగా, 12 మంది తీవ్రంగా గాయపడినట్లు పాక్ ఆర్మీ తెలిపింది. సమయం చూసుకొని బదులుగా స్పందిస్తామని చెప్పుకొచ్చారు. అయితే, భారత్ తాత్కాలిక ఆనందాన్ని శాశ్వత దుఃఖంతో భర్తీ చేస్తామని పాక్ డీజీ ఐఎస్‌పీఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరీ అన్నారు.అయితే, ఇండియన్ ఆర్మీ మెరుపు దాడులపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ రియాక్ట్ అయ్యారు. తమ దేశంలోని 5 ప్రాంతాల్లో దాడులు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలకు పాకిస్థాన్ కచ్చితంగా బదులు తీర్చుకుంటుందని వెల్లడించారు. ఈ సమయంలో పాక్ సైన్యం వెంట దేశ మొత్తం నిలబడి ఉందన్నారు. భారత్ ను ఎలా ఎదుర్కోవాలో పాక్ ఆర్మీకి తెలుసు అన్నారు. ప్రత్యర్థి ప్రణాళికలను ఎట్టి పరిస్థితుల్లోనూ మా దేశంపై నెరవేరనీయం అని ఎక్స్‌లో షెహబాజ్ షరీఫ్ పోస్టు చేశారు.ఇక, ఈ దాడులను పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ యుద్ధ చర్యలగా పేర్కొన్నారు. పాక్ ప్రధాని ప్రకటన తర్వాత భారత్– పాక్ సరిహద్దులోని పూంఛ్, రాజౌరి సెక్టార్లలో పాక్ సైన్యం కాల్పులు స్టార్ట్ చేసింది. దీనికి భారత్ సైతం కౌంటర్ ఎటాక్ కు దిగింది. ఎల్‌వోసీ వెంట ఇరు దేశాల సైనికుల కాల్పులతో ఉద్రిక్త వాతావారణం కొనసాగుతుంది. దాడులు జరిగిన ప్రాంతాల్లో మురిద్కే టెర్రరిస్టు గ్రూప్ లష్కరే తొయిబాకు హెడ్ క్వార్టర్స్‌గా ఉందని ఇండియన్ ఆర్మీ ప్రకటించింది. ఇక, పంజాబ్ ప్రావిన్స్‌లోని బహవల్పూర్‌లో మసూద్ అజార్ నేతృత్వంలోని జైష్ – ఎ– మహ్మద్ స్థావరం ఉందని తేల్చింది.

## ఆ మహిళల ప్రతీకారానికి చిహ్నమే 'ఆపరేషన్ సిందూర్'..!

న్యూఢిల్లీ : ఏప్రిల్ 22న మధ్యాహ్నం వేళ చల్లని గాలులకు సేదతీరుతున్న పర్యాటకులను ఉగ్రమూకలు లక్ష్యంగా చేసుకుని.. మరి మతం అడిగి కాల్చి చంపిన సంగతి తెలిసిందే. ఉగ్రమూకలు లక్ష్యంగా చేసుకున్న జంటల్లో అప్పటికీ ఆరు రోజుల క్రితమే వివాహమై, హనీమూన్‌కు వచ్చిన నవ దంపతులు వినయ్ నర్వాల్, హిమాన్షిని టెర్రరిస్టులు చుట్టుముట్టారు. ఉగ్రవాదులు వినయ్‌ని హత్య చేయగా, అతడి మృతదేహం వల్ల గుండెలవిసేలా రోదిస్తున్న హిమాన్షి చిత్రం దేశం మొత్తాన్ని కదిపేసింది. వినయ్ నేవి అధికారి కూడా. ఈ ఉగ్రదాడిలో భర్తలను కోల్పోయిన మహిళల ప్రతీకారానికి చిహ్నంగా ఆపరేషన్ సిందూర్‌ను చూడొచ్చని మాజీ సైనిక అధికారులు పేర్కొంటున్నారు. యోధులకు పెట్టే వీరతిలకం అనే అర్థం కూడా దీనిలో ఉందని చెబుతున్నారు.ఆపరేషన్ సిందూర్.. పహల్గాం ఉగ్రదాడిలో తమ భర్తలను కోల్పోయిన మహిళల సిందూర్‌ను తిరిగి ఇచ్చే బాధ్యత మనందరిది అని ఓ మాజీ సైనికాధికారి పేర్కొన్నారు. కాబట్టి ఆర్మీ వాళ్లు చాలా చాలా ఆలోచించి ఆ ఆపరేషన్‌కు ఆపరేషన్ సిందూర్ అని నామకరణం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో భారత సైన్యంపై ప్రశంసల జల్లు కురుస్తోంది.కశ్మీర్ యాత్ర అంటేనే.. ప్రకృతి అందాలతో కనుల విందు చేసే ఆకర్షణీయమైన పచ్చిక బయళ్లు, మంచుతో కప్పబడిన పర్వత శిఖరాలు, చుట్టూ ఎత్తైన కొండలు.. ఆ కొండల మధ్య నదులు, సరస్సులు ఆకట్టుకుంటాయి. భారీ పైన్ వృక్షాల మధ్య మూడు వేల మీటర్ల ఎత్తులో ఉన్న బైసరన్‌లో సూర్యోదయం, సూర్యాస్తామయం చూడడానికి రెండు కళ్లు చాలవు అన్నట్టుగా ఆ ప్రకృతి రమణీయత ఎంతో కట్టిపడేస్తుంది. ఎంతో సుందరమైన ఈ ప్రదేశానికి లక్షలాది మంది పర్యాటకులు తరలివస్తుంటారు. కొత్తగా పెళ్లైన జంటలకు మినీ స్విట్జర్లాండ్‌గా ప్రసిద్ధి గాంచిన బైసరాన్ హనీమూన్‌కు హాట్‌స్పాట్. కానీ ఆ హనీమూన్ స్పాట్.. తుపాకుల తూటాలతో దద్దరిల్లి.. బ్లడ్ మూన్‌గా మారిన సంగతి తెలిసిందే. భూతల స్వర్గం కశ్మీర్ యాత్ర.. జీవితాంతం ఒక మధురానుభూతిగా మిగలాలని కోరుకుంటారు.. కానీ ఈ మూడు జంటలకు జీవితాంతం శాపని తీరంగా మారింది.

విషాదాన్ని మిగిల్చిన హనీమూన్

హర్యానాలోని కర్నాల్‌కు చెందిన నేవీ ఆఫీసర్ వినయ్ నర్వాల్(26)కు ఈ ఏడాది ఏప్రిల్ 16వ తేదీన వివాహమైంది. ఏప్రిల్ 19న విందు ఏర్పాటు చేశారు. ఇక తన భార్యతో కలిసి బైసరాన్‌కు హనీమూన్‌కు వెళ్లారు లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్. ఏప్రిల్ 22న మధ్యాహ్నం పచ్చిక బయళ్లపై సేద తీరుతూ..





చల్లని గాలులను ఆస్వాదిస్తూ.. ముచ్చటించుకుంటున్న ఆ జంటను ముష్కరులు చుట్టుముట్టారు. వినయ్‌పై ఉగ్రవాదులు తూటాల వర్షం కురిపించారు. దాంతో పచ్చిక బయళ్లపై రక్తపుటేరులు పారాయి. వినయ్ భార్య దిక్కుతోచని స్థితిలో దీనంగా ఉండిపోయింది. పెళ్లైన ఏడు రోజులకే భర్తను కోల్పోవడం ఆమెను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. వినయ్ కొచ్చిలో ఉద్యోగం చేస్తున్నారు.

తీరిక దొరికిందని వెళ్లారు..

ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌కు చెందిన శుభం ద్వివేది కూడా కొత్త పెళ్లి కొడుకే. ఈయనకు ఈ ఏడాది ఫిబ్రవరి 12న పెళ్లైంది. బిజీ లైఫ్‌లో ఉన్న ద్వివేది.. ఇప్పటి వరకు ఎలాంటి పర్యటనకు తన భార్యతో కలిసి వెళ్లలేదు. తీరిక దొరకడంతో.. ఇటీవలే తన భార్యతో కలిసి కశ్మీర్ యాత్రకు వెళ్లాడు శుభం. బైసరాన్‌లో గడుపుతున్న శుభం దంపతులను ఉగ్రవాదులు టార్గెట్ చేశారు. భార్యను వదిలేసి శుభంపై ఉగ్రమూకలు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. దీంతో శుభం ప్రాణాలు కోల్పోయాడు. అయితే శుభంను మరి పేరు అడిగి కాల్చి చంపినట్లు ఆయన భార్య తెలిపారు.

స్వదేశానికి వచ్చి ఉగ్రమూకలకు బలై..

బితన్ అధికారి.. ఈయన పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తి. టీసీఎస్ ఉద్యోగి అయిన బితన్.. అమెరికాలోని ఫ్లోరిడాలో స్థిరపడ్డారు. తన భార్య సోహినీ, మూడేళ్ల కుమారుడితో కలిసి ఏప్రిల్ 8న బితన్ స్వదేశానికి వచ్చాడు. ఇక కశ్మీర్ చుట్టేద్దామని చెప్పి గత వారం.. కశ్మీర్ యాత్రకు వెళ్లాడు. బైసరాన్‌లో తన భార్యాకుమారుడితో సేద తీరుతున్న బితన్‌పై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. బితన్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. భర్తను కోల్పోయిన సోహిని, ఆమె కుమారుడు గుండెలవిసేలా రోదించారు.

## సరిహద్దు రాష్ట్రాల సిఎంలతో అమిత్ షా అత్యవసర సమీక్ష..



న్యూఢిల్లీ,పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత ఆర్మీ.. పాక్ లోని ఉగ్రస్థావరాలపై విరుచుకుపడింది. ఈ క్రమంలో సరిహద్దు నియంత్రణ రేఖ వెంబడి పాక్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో ఇప్పటివరకు ఎనిమిది మంది భారత పౌరులు మరణించినట్లు తెలుస్తోంది. అంతేకాదు, ఈ డాడులపై స్పందిస్తూ భారత్ పై ప్రతీకారం తీర్చుకుంటామని పాక్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా.. సరిహద్దు రాష్ట్రాల సిఎంలతో అత్యవసర సమీక్ష చేపట్టారు. సరిహద్దు రాష్ట్రాల సిఎంలు, సీఎస్‌లు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమిత్ షా సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, సిక్కిం, పశ్చిమ బెంగాల్ సిఎంలు, లద్దాఖ్ ఎల్జీ హాజరయ్యారు.

## సంపాదకీయం

గురువారం 08-05-2025

# మితవాదానికి మరో ఓటమి

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గమనించుకుంటున్నారో లేదో గానీ ప్రపంచంలో ఎక్కడ ఎన్ని కలు జరిగినా ఆయన చర్చనీయాంశం అవుతున్నారు. గెలుపోటముల్ని ప్రభావితం చేస్తున్నారు. ఇటీవల కెనడా ఎన్నికల్లో ట్రంప్ పట్ల మెతకగా వ్యవహరించిన కన్సర్వేటివ్‌లు ఓటమిపాలై, ఊహించని రీతిలో అధికార లిబరల్ పార్టీ గెలుపొందింది. ఇప్పుడు ఆస్ట్రేలియాలోనూ అదే జరిగింది. అచ్చం ట్రంప్ విధానాలనే అనుకరిస్తూ ఆస్ట్రేలియా ఎన్నికల్లో తిరుగులేని గెలుపు సాధించాలనుకున్న విపక్ష కన్సర్వేటివ్ పార్టీ అపజయాన్ని మూటకట్టుకోవటమే కాదు… ఆ పార్టీ గెలిస్తే ప్రధాని అవుతారనుకున్న నాయకుడు పీటర్ డటన్ సైతం ఓటమి పాలయ్యారు. 2004 తర్వాత వరసగా రెండోసారి కూడా అధికారం నిలబెట్టుకున్న పార్టీగా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ నేతృత్వంలోని లేబర్ పార్టీ చరిత్ర సృష్టించింది. ఇక సింగపూర్‌లో ఎప్పటిలా పద్నాలుగోసారి సైతం అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) తిరిగి అధికారంలోకి రావటం వింతేమీ కాదుగానీ… ఆ పార్టీ నేత, ప్రధాని లారెన్స్ వాంగ్ ప్రచారసభల్లో ట్రంప్‌పై రణభేరి మోగించారు. అమెరికా విధించిన సుంకా లకు ప్రతీకార సుంకాలుంటాయని ప్రకటించారు. అసలు అమెరికాకు సింగపూర్ నుంచి ఎగుమతులు చేసేదే లేదని స్పష్టం చేశారు. 97 స్థానాలున్న సభలో ఆ పార్టీ 87 స్థానాలు గెల్చుకోవటం గతంలో కూడా జరిగినా ఈసారి వోటు శాతాన్ని సైతం 66.57కి పెంచుకుని చరిత్ర సృష్టించింది. ఇక రుమేనియాలో మాత్రం ట్రంప్‌ను తలకెత్తుకున్న తీవ్ర మితవాదపక్షం అలయెన్స్ ఫర్ ది యూనిటీ ఆఫ్ రుమేనియన్స్ (ఏయూఆర్) నాయకుడు జార్జి సైమన్ తొలి రౌండ్‌లో గెలుపొందారు. ఈ నెల 18న జరగబోయే రెండో రౌండ్ ఎన్నికల్లో సైతం ఆయనదే విజయమన్న అంచనాలున్నాయి. వచ్చే సెప్టెంబర్‌లో ఎన్నికలు జరగబోయే నార్వేలో కూడా ట్రంప్ ప్రభావం కనబడుతోంది. అక్కడి అధి కార లేబర్ పార్టీకి ఓటమి తప్పదని జనవరిలో వివిధ సర్వేలు ప్రకటించగా, ఆ మరుసటి నెలకల్లా అంతా మారిపోయింది. ఇప్పుడు లేబర్ పార్టీయే గెలుపుగుర్రంగా కనబడుతోంది. కరోనా దాపురించినప్పటి నుంచీ ఆస్ట్రేలియా ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కాదు. ముఖ్యంగా మూడేళ్లుగా ఆ దేశంలో ఉత్పాదకత తీవ్రంగా దెబ్బతింది. ద్రవ్యోల్బణం పెరిగింది. దాన్ని తగ్గించటానికి ఆస్ట్రేలియా రిజర్వ్‌బ్యాంక్ 13 సార్లు వడ్డీరేట్లు పెంచింది. ఫలితం లేకపోగా అధిక ధరల కారణంగా కొనుగోళ్లు ఆగిపోయి గృహనిర్మాణ రంగం పడకేసింది. వీటన్నిటి వల్ల జీవన ప్రమాణాలు పడిపోయాయి. ఇవన్నీ చూసి తదుపరి ఎన్నికల్లో తమదే విజయమని కన్సర్వే టివ్ పార్టీ కలలుగంది. అమెరికాలో ట్రంప్‌కు పెరుగుతున్న మద్దతు చూసి అదే తరహా ప్రకటనలు చేసి ఆ పార్టీ నాయకుడు డటన్ మొదట్లో వోటర్ల మెప్పు పొందినమాట వాస్తవం. ప్రభుత్వ రంగంలో 40,000 ఉద్యోగాలు రద్దుచేస్తామని, వలసల విషయంలో కఠినంగా వుంటామని, ఉదార వాద విధానాలైన భిన్నత్వం, అందరినీ కలుపుకొనిపోవటం వగైరాలకు కాలం చెల్లిందని ఆయన పదే పదే ప్రకటించారు. ఆస్ట్రేలియా మొదటి నుంచీ అమెరికా మిత్ర దేశమే. అయినా ట్రంప్ ఏమాత్రం కనికరించలేదు. అందరితోపాటు ఆస్ట్రేలియాపైనా భారీయెత్తున సుంకాలు పెంచుతా మని ప్రకటించారు. ఇవింకా అమల్లోకి రాకపోయినా అమెరికా%-%చైనా వాణిజ్య యుద్ధం కారణంగా అసలే అంతంతమాత్రంగా వున్న ఆర్థిక వ్యవస్థ మరింత అనిశ్చితిలోకి పోయింది. ఈ దశలో డటన్ తనకు ట్రంప్‌తో వున్న వ్యక్తిగత సాన్నిహిత్యం వల్ల ఆస్ట్రేలియా ఆర్థిక వ్యవస్థను సునాయాసంగా గట్టెక్కిస్తానని హామీ ఇచ్చారు. కానీ ట్రంప్ దూకుడు కారణంగా స్టాక్ మార్కెట్లన్నీ బోల్తా కొట్టడంతో డటన్‌కు దిక్కుతోచలేదు. దాంతో ట్రంప్ ప్రస్తావన మానుకున్నారు. కానీ అప్పటికే జరగా ల్సిన నష్టం జరిగిపోయింది. జనం లేబర్ పార్టీకే వోటేయాలన్న నిర్ణయానికొచ్చారు. సింగపూర్ సైతం ఆర్థిక అస్థిరతలో కొట్టుమిట్టాడుతోంది. అసలే వాణిజ్యం దెబ్బతిని వుండగా ట్రంప్ అధిక సుంకాల ప్రకటన మరింత దెబ్బ తీసింది. ఆస్ట్రేలియా మాదిరే ఆ దేశంలోనూ పౌరులకు సొంతిళ్లు సమకూర్చుకోవటం సమస్యగా మారింది. పెరిగిన ద్రవ్యోల్బణం, ఆర్థికమాంద్యం, ఉద్యో గాలు కోల్పోతామన్న భయాందోళనలు ప్రజల్ని వణికిస్తున్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో అంచనాల కన్నా జీడీపీ చాలా తగ్గి 3.8 శాతానికొచ్చింది. వచ్చే త్రైమాసికంలో అది 2 శాతం మించక పోవచ్చు. ట్రంప్ సుంకాల బెదిరింపు సరేసరి. అందుకే ఈ అనిశ్చితిలో పాలకపక్షాన్నే మరోసారి గెలిపించటం ఉత్తమమన్న నిర్ణయానికొచ్చారు. కనుకనే పీఏపీ వోట్ల శాతం 61.2 నుంచి 65.67కి పెరి గింది. సింగపూర్ ఎన్నికల్ని విదేశీ మదుపుదార్లు, అంతర్జాతీయ మీడియా, వివిధ దేశాల ప్రభుత్వాలు శ్రద్ధగా గమనించాయి. ఈ అయిదేళ్లూ సింగపూర్ ఎదుర్కొన్న సమస్యలు అలాంటివి మరి.ఏతావతా ఇప్పటికి ఒక్క రుమేనియా మినహాయించి ట్రంప్‌ను చూసి వాతలు పెట్టుకుంటున్న నాయకులంతా ఊహించని ఓటమితో ఖంగుతింటున్నారు. నిరుడంతా మితవాద పక్షాలు ఎక్కడి కక్కడ విజయం సాధించగా, ప్రస్తుతం ఆ పక్షాలకు ఎదురుగాలి వీస్తోంది. అయితే గెలిచిన పక్షాలు చుట్టుముడుతున్న ఆర్థిక సంక్షోభాలకు ఎదురీదటం, జనం మెప్పు పొందటం అంత సులభమేమీ కాదు. ప్రపంచంతోపాటే మనమూ అని ఈ సంక్షోభాల్ని సరిపెట్టుకునే పరిస్థితుల్లో వారు లేరు. కనుక సమస్యలకు దీటైన పరిష్కారాలు కనుగొనటానికి గద్దెనెక్కిన నాయకులు ప్రయత్నించాల్సి వుంది. వారి మాటెలావున్నా ప్రపంచమంతటా తన కారణంగా మితవాద పక్షాలు బోల్తా కొట్టడాన్ని చూసైనా ట్రంప్ తన విధానాలను మార్చుకుంటారా, లేదా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

# తెలంగాణలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల నిలువు దోపిడీ?

హైదరాబాద్,ప్రభుత్వ నియామకాలు అటకెక్కిన వేళ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలే దిక్కవుతున్నాయి. దీని పేరుతో ప్రభుత్వానికి ఖర్చు తగ్గిందనుకున్నా.. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు మాత్రం కోట్లు వెనకేసుకుంటున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నుంచే అధికారికంగా సంస్థలకు పదిశాతం కమిషన్ పేరిట నెలకు వంద కోట్లు వెచ్చిస్తున్నట్టు సమాచారం. బీఆరెస్ హయాంలో ఇబ్బడి ముబ్బడిగా ఔట్‌సోర్సింగ్ నియామకాలు సాగాయి. ఇప్పుడు ఆర్థిక కష్టాలు, పొదుపు చర్యల పేరిట ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు కత్తెర వేస్తుండటంతో సగటు ఉద్యోగస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మంది వరకు వివిధ పేర్లతో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్నారని అంచనా. తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే భద్రత లభించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చే వేతనం పూర్తిగా అందుతుందని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అంటున్నారు. ఏపీ రాష్ట్రం తరహాలో అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కేసీఆర్ హయాంలో యథేచ్ఛగా

తెలంగాణ ఏర్పాటు అయిన తరువాత కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు ఉండరని, ఔట్ సోర్సింగ్ అనే పదం విన్పించకుండా పరిపాలన చేస్తానని ఉద్యమ సమయంలో కే చంద్రశేఖర్ రావు మాటలు చెప్పారు. ఆయన ముఖ్యమంత్రి పీఠమెక్కగానే శాశ్వత నియామకాలను అటకెక్కించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెట్టింపు చేశారు. ఈ ఉద్యోగాలను ప్రైవేటు ఏజెన్సీలకు కల్పతరువుగా మార్చారు. కొత్త రాష్ట్రం, జోన్ల విభజన పేరుతో కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించింది. ప్రభుత్వ శాఖల్లో పనులకు ఆటంకం లేకుండా ఉండేందుకు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ నియామకాలను పెద్ద ఎత్తున చేపట్టారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత తమ ఉద్యోగాలకు భద్రత ఉంటుందని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కంటినిండా నిద్రపోయారు. అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తుండడంతో ఇప్పుడు వారిలో భయం మొదలైంది. ఆర్థిక లోటు పేరుతో ప్రభుత్వం కోతలకు సిద్ధమవుతున్నదన్న వార్తలు వారిలో గుబులు రేపుతున్నాయి. శాఖలవారీగా వివరాలు తెప్పించుకుని శాఖాధిపతులు కోతలు అమలు చేస్తున్నారని సమాచారం. ఒకేసారి తొలగించకుండా దశలవారీగా కార్యాచరణ అమలు చేస్తున్నారని తెలుస్తున్నది. కొందరు అధికారులు అయితే వారం పది రోజుల ముందే సమాచారం ఇచ్చి, వచ్చే నెల 1వ తేదీ నుంచి ఆఫీసుకు రావాల్సిన అవసరం లేదని చెబుతున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఇలాంటి సంఘటనలను తెలుసుకుని మిగతా ఆఫీసులలో పనిచేస్తున్నవారు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని టీజీఈ జేఏసీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. భద్రత కల్పించకపోగా ఖజానా లోటు పేరుతో, మిగులు సిబ్బంది పేరుతో తమ పొట్టకొడుతున్నారని వారికి తెలియచేశారు. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులకు ఈ విషయాన్ని వివరించారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయండి..

పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. అదే తరహాలో తెలంగాణలోనూ ఏర్పాటు చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆ దిశగా ప్రభుత్వం అధ్యయనం చేసి, నివేదిక రూపొందించింది. రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, గౌరవ వేతనంతో ఎంత మంది? ఎక్కడెక్కడ పనిచేస్తున్నారనే వివరాలు సేకరించింది నివేదికను తయారు చేసింది. ఈ నివేదికపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి కార్యరూపం తీసుకు రావాల్సి ఉంది.

ప్రైవేటు ఏజెన్సీల ఆగడాలు.. దోపిడీలు

శాశ్వత నియామకాలు లేకపోవడంతో ప్రైవేటు ఏజెన్సీలు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతున్నదని చెబుతున్నారు. వందల



ఏజెన్సీలు కోట్లాది రూపాయలు దండుకుంటూ ఉద్యోగుల ఉసురు పోసుకుంటున్నాయని అంటున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు 81,341, జీపీ ఎంపీడబ్ల్యూ 53,185, టీజీఆర్టీసీ ఔట్ సోర్సింగ్ 1,27,326, ఎన్ఎంఆర్, డైలీవేజ్ 13,138, గౌరవ వేతనజీవులు 2,18,830 కలిపితే మొత్తం సుమారు ఐదు లక్షల మంది వరకు పనిచేస్తున్నారు. ఎక్కడ కూడా రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయడం లేదు. కొన్ని విభాగాలలో నాలుగు నెలల వరకు కూడా జీతాలు ఇవ్వకుండా సతాయిస్తున్నారు. అందుకు ఉపాధి హామీ సిబ్బందే ఉదాహరణ వారికి నాలుగు నెలల వేతనాలను ఒకేసారి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలతో సహా మొత్తం 3200 మందికి పైగా సిబ్బందికి రూ.62 కోట్లను విడుదల చేశారు. ఇప్పటికే కొందరి ఖతాల్లో జీతాలు జమ కాగా మిగతావారికి నేడో రేపో జీతాలు అందనున్నాయి. ఇదెలా ఉన్నా.. ఈఎస్ఐ, పీఎఫ్ అనేది మచ్చుకు కూడా కన్పించదు. కాని వారి నెలవారి వేతనాల నుంచి ఈ రెండింటిని అమలు చేస్తున్నామని డబ్బులు తీసుకుంటున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. పైగా ప్రొఫెషనల్ ట్యాక్స్ పేరుతోనూ కోతలు పెడుతున్నారని అంటున్నారు. ఉదాహరణకు ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి నెలకు రూ.15,600 వేతనం ఉంటే 12 శాతం ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్ పేరుతో రూ.1,875, ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్ కింద రూ.118, ప్రొఫెషనల్ ట్యాక్స్ పేరుతో రూ.110 కలుపుకుని మొత్తం రూ.2145 వరకు కట్ చేసి మిగతా మొత్తాన్ని చెల్లిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఇలా ప్రతి ఉద్యోగి నుంచి తీసుకోవడమే కాకుండా సెలవులు తీసుకుంటే అదనంగా కోత వేస్తారని సమాచారం. మరికొన్ని ఏజెన్సీలు రూ.25 00 వరకు తీసుకుంటున్నాయని, కానీ వీటిని సంబంధిత ఖాతాల్లో జమ చేయడం లేదని తెలుస్తున్నది. ఫలితంగా ఈఎస్ఐ, పీఎఫ్ అమలు కావడం లేదు. తెలంగాణ అంబేద్కర్ సచివాలయంలోనే వీటిని అమలు చేయడం లేదని ఒక అధికారి తెలిపారు.

కార్పొరేషన్ ఏర్పాటుతో భద్రత, సక్రమ వేతనాలు

ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే నేరుగా ఉద్యోగుల ఖాతాల్లోకి వేతనాలు ప్రతి నెలా వేస్తారు. ఉద్యోగ భద్రత లభించడంతో పాటు ఏజెన్సీ వేధింపులు, కమిషన్ల బాధల నుంచి పూర్తి విముక్తి లభిస్తుంది. ఈఎస్ఐ, పీఎఫ్ కచ్చితంగా అమలు పరచే అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వమే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నందున ఈ లాభాలు ఉంటాయని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. ఒక్కో ఉద్యోగికి కనీసం రూ.2వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా ప్రయోజనం చేకూరుతుందనడంలో సందేహం లేదు. అంతే కాకుండా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ విధానం అమలవుతుంది. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎంత మంది పనిచేస్తున్నారు, ఎక్కడెక్కడ పనిచేస్తున్నారనేది ప్రభుత్వ వద్ద వివరాలు ఉంటాయి. ఒక శాఖలో వారి అవసరం లేనట్లయితే పనిభారం ఉన్న శాఖల్లోకి పంపించి ఉద్యగ భద్రత కల్పించే వెసులుబాటు ప్రభుత్వానికి ఉంటుంది. అయితే కార్పొరేషన్ ను ఆర్థిక శాఖ పరిధిలోనా లేదా సాధారణ పరిపాలనా విభాగంలోనా (జీఏడీ) అనేది ప్రభుత్వం ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# నేపాల్‌లో రాచరిక పాలన అసంభవమే



నేపాల్:ప్రస్తుతం నేపాల్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల అసంతృప్తితో రాచరిక పాలనకు అనుకూల డిమాండ్ పుంజుకోవడం, రాజకీయ అస్థిరత, సామాజిక, ఆర్థిక సవాళ్లు, ప్రాంతీయ అసమానతల నేపథ్యంలో సంక్లిష్టమైన అంశమే. నేపాల్ దేశంలో పరిస్థితులు, భారతదేశం, చైనాతో దాని భౌగోళిక, రాజకీయ సంబంధాలు, భారతదేశంలో నేపాలీ మాట్లాడే జనాభాతో సంబంధాలు, దేశ భవిష్యత్ పథంలో సంభవాలు వంటి ముఖ్యఅంశాలను ఈ వ్యాసం లో ప్రస్తావిస్తున్నాం. ప్రజాస్వామ్య అస్థిరత మధ్య రాచరికం కోసం డిమాండ్ దాదాపు 240 ఏళ్లపాటు నేపాల్‌లో రాచరిక పాలన సాగింది. 2008లో రాచరిక పాలన రద్దు చేసినప్పటి నుంచి, ఆ దేశం స్థిరమైన ప్రజాస్వామ్య వ్యవస్థను స్థాపించుకోవడానికి చాలా కష్టపడుతోంది. ఫెడరల్ డెమోక్రాటిక్ రిపబ్లిక్ 17 సంవత్సరాలలో 13 ప్రభుత్వాలను చూసింది. ఏ ప్రభుత్వం కూడా పూర్తి పదవీకాలం సాగలేదు.ఇది రాజకీయ అస్తవ్యస్త పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. రాజకీయ అనుకూల ఉద్యమానికి దోహదం చేస్తున్న పలు అంశాలలో రాజకీయ అస్థిరత, అవినీతి, తరచు ప్రభుత్వాలు మారడం, హంగ్ పార్లమెంట్, తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణల కారణంగా ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల నమ్మకం సడలిపోయింది. ఉదాహరణకు 2022లో హంగ్ పార్లమెంటు ఏర్పడింది. ఫలితంగా నేపాల్‌లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్, నేపాల్ కాంగ్రెస్ వంటి పార్టీల నేతృత్వం లో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలు సుస్థిరమైన పాలన అందించలేకపోయాయి.ఆర్థికపరమైన సవాళ్లు అధిక ద్రవ్యోల్బణం, పెరిగిన ధరలు, నిరుద్యోగం, ఆర్థిక సంరక్షణ, విద్య వంటి రంగాలలో ప్రభుత్వాలు తగిన శ్రద్ధ వహించకపోవడం, ప్రజలలో తీవ్ర అసంతృప్తిని నిరాశా, నిస్పృహలను పెంచాయి. నిరసనలు పెరిగాయి. రాజేంద్రకున్వర్ వంటి చాలా మంది నేపాలీలు రాచరికానికి మద్దతు ఇవ్వడానికి పలు కారణాలను చూపుతున్నారు. ఒకనాటి రాచరిక వ్యవస్థతను స్థిరత్వానికి చిహ్నంగా చూస్తారు.హిందూ గుర్తింపు, జాతీయవాదం ప్రపంచంలో ఏకైక హిందూ రాజ్యంగా నేపాల్ గుర్తింపు పొందింది. చరిత్రాత్మకంగా సాగిన రాచరిక పాలనతో ఈ గుర్తింపు వచ్చింది. రాజులను విష్ణువు అవతారాలుగా భావించేవారు. 2008లో నేపాల్ లౌకిక గణతంత్ర రాజ్యంగా మారడంతో క్రైస్తవ మత మార్పుడులు పెరిగాయి. 2001 నాటికి 0.45 శాతంగా ఉన్న మతమార్పిడులు 2021 నాటికి 1.76 శాతానికి పెరిగాయి. దీనికి తోడు రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (ఆర్‌పిపి) వంటి రైట్‌వింగ్ పార్టీలు హిందూ జాతీయవాద భావాలను మరింత రేకెత్తిస్తున్నాయి. రాచరిక అనుకూల నిరసనలు 2025 మార్చి నుంచి మాజీ మావోయిస్ట్ గెరిల్లా దుర్గా ప్రసాయి వంటివారు ఆర్‌పిపి వంటి పార్టీల నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసనలు సాగాయి. మాజీ రాజు జ్ఞానేంద్ర షాను తిరిగి రాజుగా ప్రతిష్టించి, నేపాల్‌ను హిందూ రాష్ట్రంగా పునరుద్ధరించాలని డిమాండ్ వచ్చింది.ఖట్మండూలో పది వేల నుంచి 15 వేల మంది మద్దతుదారులు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. 2025 మార్చి 28 ఈహింసాకాండకు ఇద్దరు బలయ్యారు. రాష్ట్రీయ ప్రజాస్వామ్య పార్టీ 2022లో 275 మంది ఉన్న జాతీయ సభలో కేవలం 14 సీట్లు పొందింది. 5.5 శాతం ఓట్లు సాధించింది. అయినా ప్రజలలో రేకెత్తిన అసంతృప్తిని ఉపయోగించుకుని కేవలం రాచరికంతో కూడిన రాజ్యాంగమే దేశాన్ని సుస్థిరంగా ఏకంగా ఉంచగలదని వాదిస్తోంది. అయితే 95% ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపాల్ కాంగ్రెస్, యుఎంఎల్, మావోయిస్ట్ సెంటర్ వంటి ప్రధాన పార్టీలు ఆ వాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఫలితంగా రాచరికానికి మద్దతు నామమాత్రంగా మారింది. నేపాల్ భారతదేశం అనుబంధం, నేపాల్ భారతదేశం మధ్య లోతైన చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు నెలకొన్నాయి.దీనిని తరచు రోటీ- బేటీ (ఆహారం, వివాహం) అనుబంధంగా వర్ణిస్తారు. ఉభయదేశాల మధ్య 1,850 కిలోమీటర్ల పొడవైన బహిరంగ సరిహద్దు ఉంది. 1950లో భారత నేపాల్ మధ్య శాంతి, స్నేహ ఒప్పందంతో ఈ అనుబంధం మరింత బలోపేతం అయింది. నేపాల్ హిందూ గుర్తింపు భారత దేశంతో ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ, (బిజెపి) రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వంటి హిందూ జాతీయవాద సమూహాలతో ప్రతిధ్వనిస్తున్నది. బిజెపి నాయకుడు, ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్‌కు చెందిన ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌నాథ్ పీఠంతో షా రాజవంశం అనుబంధం కారణంగా నేపాల్‌లో రాచరిక అనుకూల ఉద్యమానికి భారతదేశం మద్దతు ఇస్తోందనే ఊహాగానాలకు ఆజ్యంపోసింది. భారతదేశం మాత్రం అధికారికంగా నేపాల్ ప్రజాతంత్ర గణతంత్ర రాజ్యానికే మద్దతు ఇస్తున్నది.రాజకీయ సున్నితత్వం నేపాల్ రాచరిక అనుకూల ఉద్యమం భారతదేశంలో ఆందోళనలను రేకెత్తించింది. ముఖ్యంగా ఆదిత్యనాథ్ రాజవంశవాదులకు మద్దతు ఇస్తున్నారని ప్రధాని కెపి శర్మ ఓలి ఆరోపణ తర్వాత ఇది మరీ హెచ్చింది. భారతదేశంలోని గౌహతిలో 2025 ఏప్రిల్ 1న ఒక రాజవంశ నాయకుడిని అరెస్ట్ చేశారు. అతడిని అప్పగింత సమస్య నివారించాలని కోరడంతో సరిహద్దు ఉద్రిక్తతలను పెంచింది. మరో పక్క చైనా ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నేపాల్‌లో స్థిరత్వానికి ప్రాధాన్యత ఇస్తూ భారతదేశం ఆచీతూచీ వ్యవహరిస్తోంది. చైనా ప్రభావం- నేపాల్ లో చైనా ప్రభావం పెరుగుతుండడం భారతదేశానికి వ్యూహాత్మక ప్రతిఘటనగా నిలుస్తోంది. ఇది భౌగోళిక రాజకీయ శత్రుత్వం, నేపాల్ ఆర్థిక అవసరాల నేపథ్యంలో రూపొందింది. చైనా నేపాల్‌లో బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్(బిఆర్ఐ) కింద

# ఖేల్ ఖతం..దుకాణం బంద్

రాజన్నసిరిసిల్ల,ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కాంగ్రెస్ చేతులెత్తేసిందని, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. సిఎం రేవంత్ వ్యాఖ్యలతో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఖేల్ ఖతం, దుకాణ్ బంద్ అంటూ బండి సంజయ్ వ్యాఖ్యానించారు. సీఎం స్వయంగా చేసిన వ్యాఖ్యలే వారి వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో రైతులకు ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారని బండి సంజయ్ ధ్వజమెత్తారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్, మహిళలకు నెలనెలా రూ.2,500, తులం బంగారం వంటి హామీలు నేరవేర్చని ప్రభుత్వం, నిరుద్యోగులకు వాగ్దానం చేసిన రూ.4,000 భృతి కూడా ఇవ్వడం లేదన్నారు. అంతేకాదు, విద్యార్థులకు హామీగా చెప్పిన రూ.5 లక్షల భరోసా కార్డు ఇప్పుడు లేదన్నట్టే తేలిందని విమర్శించారు.సంవిధాన్ చూపిస్తూ రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ బండి సంజయ్, ఆయన వాటికి సమాధానం చెప్పక తప్పదన్నారు. రేపటి నుంచి కాంగ్రెస్ మంత్రులను, ఎమ్మెల్యేలను ప్రజల మధ్య నిలదీస్తామని హెచ్చరించారు. రాజీవ్ రహదారి నిర్మాణం, నాణ్యతపై వస్తున్న విమర్శలపై కూడా బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. ఈ రహదారిని కాంగ్రెస్ ప్రభుత్వం నాగుపాముల్లా వంకరటింకరగా నిర్మించిందని, కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులు చేయించిందని ఆరోపించారు. ఇకపై 2035 వరకు కాంట్రాక్టర్‌తో ఒప్పందం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే చేసిందని గుర్తు చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, 6 లేన్ జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 2022లోనే ప్రతిపాదనలు చేసిన విషయాన్ని సంజయ్ స్పష్టం చేశారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఆడుతోందని బండి సంజయ్ విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డకు కూడా కేంద్ర మంత్రి గడ్కరీ ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పినట్టు- గుర్తుచేశారు. లేఖల పేరుతో కేంద్రంపై బురద చల్లడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఎం వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు, మంత్రులు కూడా స్పష్టత ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే రాష్ట్రం దివాలా తీసిందని పేర్కొనడం సిగ్గుచేటని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ప్రభుత్వ పెద్దగా ప్రజల్లో ధైర్యం నింపాల్సిందిపోయి అధైర్యాన్ని నూరిపోస్తూ రాష్ట్రం పరువు తీస్తున్నారని ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం నడపలేమనే స్థితిలో కాంగ్రెస్ ఉందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే అడ్డగోలు హామీలు ఇచ్చారని.. ఇప్పుడు ఆరు గ్యారంటీలు అమలు చేయలేమని చేతులెత్తేశారని విమర్శించారు. కేంద్రమంత్రులు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని సీఎం చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చిన రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

# సిబిఐ చీఫ్‌గా ప్రవీణ్ సూద్ కొనసాగింపు

న్యూఢిల్లీ, కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ చీఫ్‌గా ప్రస్తుత డైరెక్టర్ ప్రవీణ్ సూద్ మరో ఏడాదిపాటు కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆయన పదవీకాలం మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు డిఓపిటి త్వరలో ఉత్తర్వులు ఇవ్వనుంది. ఈనెల 25తో ప్రవీణ్ సూద్ రెండేళ్ల పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలో ఆయన పదవీ కాలం మరో ఏడాది పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 2023, మే 25న సీబీఐ డైరెక్టర్‌గా ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. కాగా నూతన డైరెక్టర్ నియామకంపై సెలెక్ట్ కమిటీ- సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. నూతన సీబీఐ డైరెక్టర్ నియామకం కోసం సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కుడిన సెలెక్ట్ కమిటీ సమావేశమైంది. తదుపరి డైరెక్టర్ కోసం పలువురు పేర్లతో డివోపిటి జాబితాను రూపొందించింది. ప్రతిపాదిత అధికారుల పేర్లపై సెలెక్ట్ కమిటీలో చర్చ జరిగింది. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రస్తుత డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలాన్ని మరో సంవత్సరం పొడిగించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. సౌత్ బ్లాక్‌లోని ప్రధాని కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. పహల్గాం దుర్ఘటన అనంతరం తలెత్తిన పరిస్థితులు, సైన్యం సన్నద్ధతపై రాహుల్‌తో అభిప్రాయాలు పంచుకున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. నిజానికి ఈ సమావేశం సీబీఐ తదుపరి చీఫ్ ఎంపిక కోసం జరిగింది. సీబీఐ చీఫ్‌ను ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ- ఎంపిక చేయాల్సి ఉంది. దాంతో రాహుల్‌తో పాటు- సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ప్రధాని కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుత సీబీఐ చీఫ్ ప్రవీణ్ సూద్ ఈ నెలలో పదవీ విరమణ చేయాల్సి ఉంది. సీబీఐ డైరెక్టర్ పదవీకాలం సాధారణంగా రెండేళ్లు ఉంటుంది. అయితే, ప్రత్యేక పరిస్థితుల్లో దీనిని ఐదేళ్ల వరకు పొడిగించే వెసులుబాటు చట్టంలో ఉంది. కర్ణాటక కేడర్‌కు చెందిన 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్, గతంలో ఆ రాష్ట్ర డీజీపీగా పనిచేశారు. సుబోధ్ కుమార్ జైస్వాల్ స్థానంలో ఆయన 2023 మే నెలలో సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

# సిఎంగా కొనసాగే హక్కు లేదు

సూర్యాపేట,రేవంత్ రెడ్డి ఒక్క క్షణం కూడా సీఎం గా కొనసాగేందుకు అర్హత లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆయన తక్షణమే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ తొలి నుంచీ చెబుతోన్న విషయం నేడు నిజమవుతుందన్నదని స్పష్టమైందన్నారు. ఓనమాలు రాని వాడిలా పదో తరగతి చదివినట్లున్నది రేవంత్ తీరని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి ఎటువంటి ముప్పు లేదని, కానీ రేవంత్ పరిపాలనకు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.కేసీఆర్ హయాంలో అప్పులనుంచి తెలంగాణ రాష్ట్రానికి రెండున్నర లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని, కానీ రేవంత్ పాలనలో రాష్ట్ర ఆదాయం తగ్గిపోగా, మంత్రుల ఆదాయం మాత్రం పెరిగిందని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ఆదాయం లూటీ చేస్తూ ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. సీఎం పదవి కోసం మంత్రులు పోటీ- పడి సంపాదనలో మునిగిపోతున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి హామీలను తప్పించుకునేందుకు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. సీఎం మాట్లాడిన ప్రతి అక్షరం అబద్ధమని, ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే అని అన్నారు. మాది వందేళ్ళ చరిత్ర, అపార పరిపాలనా అనుభవం. ఒక్క సంవత్సరం మంత్రులు కడుపు కట్టు-కుంటే అన్ని హామీలు అమలయ్యేవని సూచించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ పరువు బజార్లో పెట్టారని ఆరోపిస్తూ, రాష్ట్ర మానాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ వాసికి ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడి పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# నగరంలో మరోమారు హైడ్రా దాడులు

హైదరాబాద్, హైదరాబాద్ నగరంలో హైడ్రా మరోసారి భారీగా కూల్చివేతలను చేపట్టింది. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకొని మినీ హాల్, ఫుడ్ కోర్ట్‌తో పాటు– అనేక అనుమతులు లేని నిర్మాణాలను తొలగించారు. ఉదయం నుంచే మూడు భారీ బుల్డోజర్ల సహాయంతో కూల్చివేతల ప్రక్రియ ప్రారంభమైంది. పోలీసులు ఘటనా స్థలంలో బందోబస్తును ఏర్పాటు చేసి, ఎవరికీ లోపలికి వెళ్లేందుకు అనుమతించలేదు. ఈ కూల్చివేతలు ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ– లేఅవుట్ పరిధిలో నిర్వహించబడ్డాయి. సంబంధిత లేఅవుట్‌కు ప్రభుత్వ అనుమతులు లేకుండానే రోడ్లు, పార్కులు వంటి ఉమ్మడి భూములపై ఆక్రమణలు జరిగాయని తెలుస్తోంది. రోడ్లను ఆక్రమించి నిర్మించిన గదులు, రెస్టారెంట్లు–, ఫుడ్ కోర్టులు వంటి కట్టడాలను హైడ్రా అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా పలువురు ప్లాట్ యజమానులు తమ స్థలాలు కనబడకుండా అక్రమ నిర్మాణాలు చేసినట్టు– ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా నిర్మించిన వంటగదులు, రెస్ట్‌రూములు, మినీ హాల్ వంటి నిర్మాణాలన్నీ హైడ్రా అధికారుల పర్యవేక్షణలో కూల్చివేశారు. అంతే కాకుండా, జీ ప్లస్ 2 అంతస్థుల్లో నిర్మించిన మూడు ఐరన్ షెడ్లు కూడా తొలగించబడ్డాయి. అదనంగా లేఅవుట్‌ను ఆక్రమించి వేసిన రేకుల ఫెన్సింగ్‌ను కూడా అధికారులు తొలగించారు. నగర శ్రేయస్సు కోసం, భవిష్యత్తులో ఇటువంటి అక్రమ నిర్మాణాలకు తావు లేకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటు–న్నట్లు– అధికారులు పేర్కొన్నారు. శాసనానుగుణంగా మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపోతే రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లిలో కూడా కూల్చివేతలు చేపట్టింది . స్థానిక ఇందిరా గాంధీ సొసైటీలో ఆక్రమణలను తొలగించారు హైడ్రా అధికారులు. రోడ్డును ఆక్రమించి ప్రహారీగోడ నిర్మించటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని హైడ్రకు ఫిర్యాదు చేశారు స్థానికులు. స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు అధికారులు. ఈ క్రమంలో హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు ఆక్రమణదారులు.ప్రహారీగోడ నిర్మించిన స్థలం తమదే అంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు ఆక్రమణదారులు. దీంతో ఘటనాస్థలం దగ్గర ఉద్రిక్తత నెలకొంది.

# సైబర్‌నేరగాళ్ల కన్ను

హైదరాబాద్,శ్రీశైలంలో రూమ్ బుక్ చేస్తే సైబర్ కేటుగాళ్లు లక్ష రూపాయలు కొట్టేశారు.. అది ఎలా జరిగిందని ఆరా తీస్తే సైబర్ మోసం బయటపడింది. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి (31), తనకు సంబంధించిన మూడు మొబైల్ నెంబర్లను ఉపయోగించి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా శ్రీశైలం వైశ్యసత్రంలో గదులు బుక్ చేసుకున్నాడు. గదికి రూ.1000 కాగా దానిని బాధితుడు చెల్లించాడు.తర్వాత బాధితుడికి రూ.180 అదనంగా జీఎస్‌టీ చార్జీలు చెల్లించాలని అభ్యర్థిస్తూ కాల్ వచ్చింది. అప్పటికే జీఎస్‌టీ చెల్లించనందున అతనికి రూమ్ బుక్ కాకపోవడంతో తాను చెల్లించిన మొత్తాన్ని రిటర్న్ చేయాలని కోరాడు. అక్కడ కాల్ చేసిన వ్యక్తి రీఫండ్ ప్రక్రియ కోసం రూ.1 చెల్లించాలని అడగగా బాధితుడు చెల్లించాడు.తర్వాత తన అకౌంట్‌లో లక్షరూపాయలు లేకపోవడాన్ని గమనించి వెంటనే తనకు కాల్ చేసిన వ్యక్తులను సంప్రదించగా వారు స్పందించకపోవడంతో సైబర్ పోలీసులను ఆశ్రయించాడు.ఇటువంటి మోసాలు ఒక్క తెలుగురాష్ట్రాల వరకే పరిమితం కాలేదు. ఇప్పుడు చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైంది. ముందునుంచి చార్‌ధామ్ వసతులు, ఇతర సౌకర్యాల పేరుతో ఈ సంవత్సరం ఆన్‌లైన్ సేవలు పెరిగిపోయాయి. గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఎక్కువగా ఈ సేవలందించే సైట్లే కనిపిస్తున్నాయి.తమకు అనుకూలంగా ఉంటుంది కదా అని నమ్మి అడుగేస్తే మోసపోయే అవకాశముంటుందని సైబర్ పోలీసులు చెబుతున్నారు.

33 రకాల మోసాలు..!

హైదరాబాద్‌తో సహా తెలంగాణ రాష్ట్రంలో రకరకాలుగా మోసాలు చేస్తూ ఏటా వందల కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న సైబర్ క్రిమినల్స్ తాజాగా ఆధ్యాత్మిక పర్యాటకంపై కన్నేశారు. దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులను టార్గెట్‌గా చేసుకుంటూ మోసాలు చేస్తున్నారు. ఇటీవల వరుసగా ఈ తరహా నేరాలు జరుగుతుండడంతో సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ అలర్ట్ అయింది. ఆధ్యాత్మికతను అడ్డం పెట్టుకుని 33 రకాలుగా మోసం చేస్తున్న సైబర్ నేరగాళు ఒక్క తెలంగాణ నుంచే ఏటా రూ.700 కోట్లు కొల్లగొడుతున్నట్లు ఇటీవల సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ ప్రకటించింది.కేదార్‌నాథ్ యాత్రికులకు హెలికాప్టర్ బుకింగ్‌లు, చార్‌ధామ్ యాత్రికులకు గెస్ట్ హౌజ్‌లు, హోటల్‌బుకింగ్‌లు, క్యాబ్ సర్వీసులు అందిస్తామంటూ ఫేక్ వెబ్‌సైట్లు, ఫేస్ బుక్ పోస్టులు పెట్టి మరీ మోసాలు చేస్తున్నారు. గూగుల్ తరహా సెర్చ్ ఇంజన్లలో ప్రకటనలు ఇస్తూ వందల మందిని బోల్తా కొట్టిస్తున్నారు. హాలిడే ప్యాకేజిల పేరిట టోకరా ఇస్తున్నారు. వీరి వలలో చిక్కి చెల్లింపులు చేస్తున్న వారికి ఆ తరువాత అందాల్సిన సేవలు అందడం లేదు.

చార్‌ధామ్ పేరుతో మోసాలు..!

సాధారణంగా ప్రజలు చార్‌ధామ్ పర్యటనలకు వెళ్తే ముందుగానే హెలికాప్టర్ బుకింగ్స్, హోటల్‌గదులు, క్యాబ్ సేవలు వంటివాటిని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటారు. దీనిని సైబర్ ముఠాలు అవకాశంగా తీసుకుని ఫేస్‌బుక్, గూగుల్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో స్పాన్సర్డ్ అన్న పేరుతో నకిలీ యాడ్స్ వేస్తున్నారు. అలా లింక్‌లపై క్లిక్ చేసిన వారిని నమ్మదగని వెబ్‌సైట్లకు మళ్లించి ముందస్తు చెల్లింపులు తీసుకుంటున్నారు.కేవలం వెబ్‌సైట్లు మాత్రమే కాదు.. వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రాముల వంటి వేదికల ద్వారా వ్యక్తిగతంగా మేసేజ్‌లు రావడం, ఆఫర్‌లో చార్‌ధామ్ ప్యాకేజి, హెలికాప్టర్ టికెట్‌లు తగ్గింపు ధరలో లభ్యం అనే మాటలు చెబుతూ భక్తుల నమ్మకాన్ని దోచుకుంటున్నారు. కొన్ని ఫేక్ ట్రావెల్ ఏజెన్సీలు గూగుల్ రిజిస్ట్రర్లతో కూడిన నకిలీ లింకులు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. బాధితులు తాము అంతదూరం వెల్లి సదుపాయాలు తీసుకోవడం కష్టం కాబట్టి ముందుగానే ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకుని వెళ్తే ప్రయాణం సుఖవంతమవుతుందని భావిస్తున్నారు.అయితే ఆన్‌లైన్‌లో తాము బుక్ చేసుకున్న తర్వాత ఎలాంటి కన్‌ఫర్మేషన్ రాకపోవడం, ఫోన్‌నెంబర్లు పనిచేయకపోవడం, రీఫండ్ అవకాశం లేకపోవడం వంటి సమస్యలుఎదుర్కొంటున్నారు.

# అదుపుతప్పి బోల్తాపడ్డ ఆటో

పార్వతీపురం, దినసరి కూలీలతో వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడటంతో పలువురు కూలీలకు గాయాలయ్యాయి. ఈఘటన మంగళవారం మన్యం జిల్లా పార్వతీపురం రూరల్‌లో జరిగింది. మండలంలోని పెద్దమరికి గ్రామం నుంచి కారాడవలస వెళుతున్న ఆటో మార్గమధ్యంలోని కృష్ణపల్లి గ్రామ శివారు మలుపు వద్ద అదుపుతప్పి పంట పొలాల్లో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జయింది. ఎప్పటిలాగానే పెద్దమరికి దినసరి కూలీలు సిమెంట్ పని నిమిత్తం కారడవలసకు ఆటోలో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రలను 108 సహాయంతో పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరి కుడి కాలికి తీవ్రంగా గాయాలైనట్లు– తెలుస్తుంది.

# ట్రంప్ దెబ్బకు ఫలితాలు తారుమారు



వాషింగ్టన్,ట్రంప్ దురుసు వ్యాఖ్యల ప్రభావం అమెరికాపై మాత్రమే కాదు, ఇతర దేశాల మీద కూడా కనబడుతోంది. తాజాగా జరిగిన కెనడా, ఆస్ట్రేలియా ఎన్నికలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కెనడా పార్లమెంటు ఎన్నికల్లో లిబరల్ పార్టీ తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంటుందని ఎవరూ కలలో కూడా ఊహించలేదు. ఎందుకంటే, ఇటీవలే పదవినుంచి దిగిపోయిన జస్టిన్ ట్రూడో ఆ పార్టీకి చేసిన నష్టం అంతాఇంతా కాదు. కోరి ఇండియాతో కయ్యానికి కాలు దువ్వి, సిక్కు ఉగ్రవాదులకు వత్తాసు పలుకుతూ స్వజాతీయులైన కెనడియన్లలో కావలసినంత అప్రదిష్టను మూటగట్టుకున్నారు. జనవరి తొలివారంలో ఆయన రాజీనామా చేసేనాటికి విపక్ష కన్జర్వేటివ్ పార్టీకంటే అధికార లిబరల్ పార్టీ 20 పాయింట్లు వెనకబడి ఉంది.జనవరి మూడో వారంలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశాక, కెనడాలో వెంటవెంటనే మార్పు లు చోటుచేసుకున్నాయి. ఇరుగుపొరుగు దేశాలతో స్నేహభావంతో మెలగాలనే ఇంగితం లేని అగ్రరాజ్యాధినేత కెనడా, మెక్సికో వంటి దేశాలతో తెగతెంపులు చేసుకునేందుకే ప్రయత్నించారు. అది చాలదన్నట్లు కెనడియన్ల మనోభావాలు దెబ్బతినేలా వాచాలత్వం ప్రదర్శించారు. కెనడాపై అధిక సుంకాలు విధించడమే కాదు. అమెరికాలో కెనడా 51వ రాష్ట్రం అవుతుందంటూ పదేపదే ఆయన చేసిన వ్యాఖ్యలు కెనడియన్లలో జాతీయ భావాన్ని రెచ్చగొట్టాయి.తమ ఉనికినే ప్రశ్నించేలా ట్రంప్ మహాశయుడు చేస్తున్న వ్యాఖ్యలు వారిని ఒక్కతాటిపై నిలిచేలా చేశాయి. అదే సమయంలో లిబరల్ పార్టీ పగ్గాలు చేపట్టిన మార్క్ కార్నీ ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవడంలో నూటికి నూరు శాతం విజయం సాధించారు.ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకించడం ద్వారా, ఎన్నికల సభలలో ట్రంప్ వ్యాఖ్యలను ఎండగట్టడం ద్వారా మెజారిటీ ఓటర్ల మనసు గెలుచుకున్నారు. మన దేశాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా తన అధీనంలోకి తెచ్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారంటూ ఆయన చేసిన ఎన్నికల ప్రసంగాలు ఓటర్లలో ఆలోచన రేకెత్తించాయి. ఇదే పని కన్జర్వేటివ్ నేతలు చేయలేకపోయారు. ఫలితంగా మెజారిటీకి కేవలం మూడు సీట్లు తక్కువగా 169 సీట్లు గెలుచుకుని లిబరల్ పార్టీ తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంది. మూడు నెలల ముందు కార్నీ కేవలం మాజీ సెంట్రల్ బ్యాంకర్ మాత్రమే. రాజకీయాలలో ఎలాంటి అనుభవం లేని ఆయన మూడు నెలలు తిరిగేసరికి ప్రధాని కాబోతున్నారంటే అందుకు పరోక్షంగా డొనాల్డ్ ట్రంప్ కారణమని చెప్పక తప్పదు. విచిత్రంగా కెనడా ఎన్నికల తర్వాత ఐదు రోజులకు జరిగిన ఆస్ట్రేలియా ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతమైంది. ట్రంప్ సుంకాల విధానమే ఆస్ట్రేలియా లోనూ అధికార లిబరల్ పార్టీకి మరొకసారి అందలం కట్టబెట్టేందుకు పరోక్షంగా కారణమైంది. కెనడాపై ట్రంప్ పది శాతం సుంకాలు విధించారు.అమెరికా వైఖరిని అప్పట్లోనే ప్రధాని అల్బనీస్ తీవ్రంగా ఖండించారు. కాగా, ట్రంప్ బాటలో నడుస్తానని, ప్రభుత్వ వ్యయంలో కోత విధించి, ఉద్యోగాల సంఖ్య కుదిస్తానని ప్రకటించిన విపక్ష లిబరల్ నేషనల్ పార్టీ అగ్రనేత పీటర్ క్రెయిగ్ డటన్ ఎన్నికల్లో బొక్కబోర్లా పడగా, ఎవరినీ అనుసరించబోమనీ, విలువలకు అనుగుణంగానే పాలన కొనసాగిస్తానని నమ్మబలికిన ప్రస్తుత ప్రధాని అల్బనీస్ మరోసారి లిబరల్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. గత రెండు దశాబ్దాలలో ఆస్ట్రేలియాలో రెండోసారి ఎన్నికల్లో గెలిచిన తొలి ప్రధానిగా ఆయన రికార్డు సృష్టించారు. వాస్తవానికి ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ముందువరకూ ఆస్ట్రేలియాలో ఈసారి విపక్ష కన్జర్వేటివ్ పార్టీదే విజయమని అందరూ ఊహించారు. కానీ కెనడాలో మాదిరిగానే ఇక్కడ కూడా ఈ మూడు నెలల్లోనే పరిస్థితులు మారి, అధికార పార్టీవైపు జనం మొగ్గు చూపడం విచిత్రం.ఇరు దేశాల్లోనూ విపక్ష నేతలు ట్రంప్ విధానాలకు వత్తాసు పలికి, పరాజయాన్ని మూటగట్టుకోగా, ట్రంప్ విధానాలను ఎండగట్టడం ద్వారా అధికార పార్టీలు లాభపడ్డాయని చెప్పవచ్చు. ఇరు దేశాల్లోనూ ట్రంప్ సుంకాల బెదిరింపుల పట్ల యువ ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత కనిపించడం మరో ముఖ్యమైన విషయం. ప్రపంచ దేశాలలో అమెరికా పట్ల పెరుగుతున్న వ్యతిరేకతకు తాజాగా జరిగిన కెనడా, ఆస్ట్రేలియా ఎన్నికలే ఉదాహరణ. భవిష్యత్తులోనూ ఇలాంటి ఫలితాలే మరిన్ని దేశాలలోనూ ద్యోతకమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ సహా ఇతర ఆసియా దేశాలను కలుపుకుని అమెరికాకు దీటుగా వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకునే ప్రయత్నాలను చైనా మొదలుపెట్టడం గమనార్హం. శత్రువుకు శత్రువు మనకు మిత్రుడనే నానుడి అమెరికా విషయంలో నిజమవుతోంది%ా% అదే విచిత్రం!

# తిరుపతిలో సంచలనం రేపుతున్న బుగ్గ మఠం భూముల రీసర్వే..



తిరుపతి నగరంలో ముఖ్యమైన ప్రాంతాలంతా ఇదివరకు ఉన్న మఠాలకు చెందినవే. హథిరామ్ మఠం తరహాలో బుగ్గ మఠానికి సైతం నగరంలో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి.తిరుపతిలో బుగ్గ మఠం భూముల ఆక్రమణ నిజమేనా? ఆ భూముల్లో సర్వే చేసిన అధికారులు ఏం తేల్చారు? వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు బుగ్గమఠం భూములు ఆక్రమణకు గురయ్యాయంటూ వచ్చిన ఆరోపణలపై సర్వే అధికారులు ఏం తేల్చారు? ఏపీలో సంచలనం రేపుతున్న బుగ్గ మఠం భూముల రీ సర్వేపై నిజాలను సర్వే అధికారులు బయటపెట్టారా? ఇంతకీ సర్వే అధికారులు తేల్చిన ఆ కీలకాంశాలేంటి? మఠం భూముల ఆక్రమణల గుట్టు బయటపడినట్లేనా?

మాజీ మంత్రి పెద్దిరెడ్డి నివాసం ఉంటున్న భూములు మఠానికి చెందినవే..!

తిరుపతి నగరంలో బుగ్గ మఠం భూముల సర్వే రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూములను ఆక్రమించారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో బుగ్గ మఠం భూముల రీ సర్వే జరుగుతోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసం ఉంటున్న భూములు ఇదివరకు బుగ్గ మఠానికి చెందినదిగా చెబుతున్నారు. అయితే ఈ భూములు తన సోదరుడు కొనుగోలు చేసినవని పెద్దిరెడ్డి చెబుతుండగా.. తాజాగా రీ సర్వే చేసిన అధికారులు బుగ్గ మఠం భూములు ఆక్రమణకు గురయ్యాయని ప్రాథమికంగా నిర్ధారించారు.అయితే కబ్జా చేసిన వారు ఎవరు? ఎంత భూమిని ఆక్రమించారు? అనేది తేలాల్సి ఉంది. 6 సర్వే నంబర్లలో తమ మఠానికి 14.49 ఎకరాల భూమి ఉందని, వాటికి హద్దులు తెలపాలంటూ తిరుపతి అర్బన్ తహసీల్దార్‌కు బుగ్గ మఠం ఈవో వెంకటేశ్వర్లు గత నెల 17న వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 3న రెవెన్యూ, సర్వే అధికారులు రోవర్ ద్వారా హద్దులను గుర్తించారు. అదే రోజు సంబంధిత నివేదికతో పాటు స్కెచ్, గూగుల్ మ్యాప్‌లను బుగ్గ మఠం అధికారులకు అందించారు.

3.88 ఎకరాలు పెద్దిరెడ్డి ఆక్రమణలో..!

మొత్తం 14.49 ఎకరాల్లో 3.88 ఎకరాలు మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమణలో ఉన్నట్లు గతంలోనే విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. రికార్డులు ఉంటే అందించాలని బుగ్గ మఠం అధికారులు ఆయనకు నోటీసులు ఇచ్చినా ఇప్పటివరకూ స్పందించలేదు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆ భూమిలో నుంచి పెద్దిరెడ్డి నివాసానికి వెళ్లేందుకు 9.51 లక్షలతో సిమెంట్ రోడ్డును నిర్మించారు. రహదారికి పక్కనే బుగ్గ మఠం స్థలంలో పశుగ్రాసం సాగు చేస్తున్నారని సర్వే అధికారులు ఇచ్చిన స్కెచ్‌ను బట్టి తెలుస్తోంది.స్థానికుల విజ్ఞప్తి మేరకు రహదారి వేస్తున్నామని అప్పట్లో పేర్కొన్నా, ఇప్పటికీ ఆ మార్గంలో సామాన్యులు రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. మరోవైపు మఠానికి ఎంత భూమి ఉంది? ప్రస్తుతం ఉన్నది ఎంత? లీజుకు ఇచ్చింది ఎంత? అనే వివరాలు అందించాలని తిరుపతి ఆర్డీవో కార్యాలయ అధికారులు బుగ్గ మఠం ఈవోను కోరారు. వాటితోపాటు తాము గుర్తించిన హద్దుల ప్రకారం ఎంత భూమి ఆక్రమణలో ఉందో తెలపాలన్నారు. ఈ సమాచారం ఇచ్చేందుకు 10 రోజులు సమయం కావాలని మఠం అధికారులు కోరారు. ఆ తర్వాత కబ్జా చేసిన వ్యక్తులపై రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోనుంది.

బుగ్గ మఠానికి నగరంలో వేలాది ఎకరాల భూములు..

తిరుపతి నగరంలో ముఖ్యమైన ప్రాంతాలంతా ఇదివరకు ఉన్న మఠాలకు చెందినవే. హథిరామ్ మఠం తరహాలో బుగ్గ మఠానికి సైతం నగరంలో వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న ఈ భూములు కోట్ల రూపాయలు ఖరీదైనవి. అయితే ఇందులో చాలావరకు ఆక్రమణకు గురయ్యాయి. చాలా ఏళ్ల క్రితం ఈ భూములను మఠం పెద్దల నుంచి కౌలుకు తీసుకుని చివరకు వాటిని సొంతం చేసుకున్నారు. ఈ భూములపై వివిధ కోర్టుల్లో అనేక కేసులు కూడా నడుస్తున్నాయి.మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తిరుపతి నగరం నడిబొడ్డున సొంతిల్లు ఉంది. ఇంటి చుట్టూ గోశాల, ఇతర ప్రత్యేక భవనాలు ఉన్నాయి. సుమారు మూడేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడే చంద్రబాబు.. పెద్దిరెడ్డి నివాసం ఉన్న స్థలంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుగ్గ మఠం భూములను ఆక్రమించుకొని పెద్దిరెడ్డి తిరుపతిలో నివాసిస్తున్నారని నాడు ఆరోపించారు. చంద్రబాబు ఆరోపణలు అవాస్తవం అంటూ మంత్రి హోదాలో అప్పుడే పెద్దిరెడ్డి చంద్రబాబుకు కౌంటర్ ఇచ్చారు.

సదుం అటవీ ప్రాంతంలో పెద్దిరెడ్డి అతిథి గృహం..

బుగ్గ మఠం భూములు ఆక్రమణకు గురయ్యాయని తాజాగా సర్వే అధికారులు ప్రాథమికంగా నిర్ధారించడంతో ఇప్పుడు ఏం చేయబోతున్నారన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే పుంగనూరు నియోజకవర్గంలోని సదుం అటవీ ప్రాంతం నడుమ పెద్దిరెడ్డి అతిథి గృహం నిర్మాణంపై కూడా ఆ మధ్య పెను దుమారం రేపింది. అటవీ భూములను ఆక్రమించుకున్నారని పెద్దిరెడ్డిపై ఆరోపణలొచ్చాయి. ఈ విషయం మర్చిపోకముందే తిరుపతిలో ఆయన నివాస భూమిపై వివాదం తాజాగా తెరపైకి వచ్చింది.ఈ వివాదంపై పెద్దిరెడ్డి ఇప్పటివరకు మీడియా ముందుకొచ్చి క్లారిటీ ఇవ్వలేదు. అయితే ఈ భూములు తన సోదరుడైన తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అధికారికంగా కొనుగోలు చేసినట్లు పెద్దిరెడ్డి చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని రికార్డులను సైతం అధికారులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా చివరికి ఈ వ్యవహారం ఎలాంటి మలుపు తిరుగుతుందో అన్న చర్చ జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది.

# రైలుబోగీలోసీటు దక్కిన వారు మరొకరిని రానివ్వరు

న్యూఢిల్లీ,రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఓబీసీ రిజర్వేషన్లపై వాదనల సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరిగిన వాదనల సందర్భంగా పలు వ్యాఖ్యలు చేశారు. సామాజికంగా, రాజకీయంగా వెనకబడిన వర్గాల (ఓబీసీ) రిజర్వేషన్ల గురించి సీనియర్ అడ్వకేట్ గోపాల్ శంకరనారాయణనన్ వాదిస్తున్న సందర్భంలో జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్లు రైలు భోగీ లాంటివి. సీట్లు దొరికించుకున్న వాళ్లు మరొకరిని రానివ్వరని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. మహారాష్ట్రలో రాజకీయంగా వెనకబడ్డారా లేదా నిర్ధారించకుండా బంతియా కమిషన్ ఓబీసీలకు రిజర్వేషన్ ఇచ్చిందని అడ్వకేట్ శంకరనారాయణన్ వాదించారు. ఈ సందర్భంగా.. రైలు భోగీలో సీటు– దొరికిన వారు మరొకరికి సీటు ఇవ్వడానికి ఇష్టపడరని, ఇండియాలో కూడా రిజర్వేషన్ సిస్టం ఇలాగే ఉందని అన్నారు. జస్టిస్ సూర్యకాంత్ నవంబర్ 24 నుంచి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. మే 14 నుంచి జస్టిస్ గవాయ్ సీజేఐ గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీ విరమణ తర్వాత జస్టిస్ సూర్యకాంత్ తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్నారు. మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు 2016–17 నుంచి ఇప్పటి వరకు జరగలేదు. కారణం ఓబీసీ కోటా రిజర్వేషన్లపై కేసు నడుస్తుండటమే. అయితే మహారాష్ట్రలో ఓబీసీ కోటాను 27 శాతం అమలు చేయాలని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కమిషన్ వేయాలని, రిజర్వన్ల కోటా 50 శాతం మించరాదని అప్పట్లో సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో ప్రభుత్వం అమలు చేయాలనుకున్న 27 శాతం రిజర్వేషన్ల అంశం వాయిదా పడింది.

# అందాల పోటీలపై విమర్శలు.. కొట్టి పారేసిన మంత్రి జూపల్లి

హైదరాబాద్,హైదరాబాద్ వేదికగా అందాల పోటీలకు రంగం సిద్ధం అయ్యింది. ప్రపంచంలో ఉన్న సుందరీమణులు అంతా హైదరాబాద్ చేరుకుంటున్నారు. తెలంగాణ ఖ్యాతిని విస్తృత పరిచేందుకు ఈ అవకాశాన్ని ప్రభుత్వం బాగాను ఉపయోగించుకుంటోంది. నిజానికి ఇదొక మార్కెట్. ఇక్కడ అతివల అందాన్ని ప్రదర్శించడమన్నది ఒక కళగానేచూడాలి. దీనిపై కొందరు విమర్శలు చేస్తున్నా, తెలంగాణకు మాత్రం ప్రయోజనకారిగానే ఉంటుందని భావించాలి. ఓ పక్క వడ్లు అమ్మేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. సిఎం రేవంత్ మాత్రం అందాల పోటీలపై దృష్టి పెట్టారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అందాల పోటీ పట్ల ఉన్న శ్రద్ధ రైతుల పట్ల లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఇకపోతే అందాల పోటీలు అతివలను కించపరిచేవని, వారిని తక్కువ చేసి చూపేవిగా ఉంటాయని సిపిఐ నేత నారాయణ అభిప్రాయపడ్డారు. ఇది కూడా నిజం కాదు. ఈ పోటీల వల్ల తెలంగాణ టూరిజం వెలుగులోకి వస్తుంది. మన వస్తువులకు ప్రపంచ మార్కెట్‌లో విలువ పెరుగుతుంది. మరో రకంగా వ్యాపార కార్యకలాపాలు ఊపందుకుంటాయి. అదనంగా మన ఖజానాకు ఆదాయం కూడా వస్తుందనడంలో సందేహం లేదు. టూరిజం ప్రమోషన్, పెట్టుబడుల ఆకర్షణ కోసమే మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నామని పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ పర్యాటకాన్ని ప్రపంచానికి చూపిస్తామన్నారు. మిస్ వరల్డ్ పోటీలపై కొందరు రాజకీయ కోణంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మిస్ వరల్డ్ పోటీలు ఏ కోణంలో చూస్తే అలా కనిపిస్తాయని.. ఈ ఈవెంట్‌కు వందల కోట్లు ఖర్చుపెట్టడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఖర్చు చేసే రూ.5 కోట్లు– కూడా తిరిగి ప్రభుత్వానికి వస్తాయని తెలిపారు.అలాగే తాము ఫార్ములా ఈ రేసును కూడా తప్పు పట్టలేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చేసిన కోట్ల రూపాయల చెల్లింపులను తప్పు పట్టామని స్పష్టం చేశారు. మమ్మల్ని విమర్శించడమే బీఆర్ఎస్ పని అంటూ మండిపడ్డారు. మాజీ మంత్రి హరీష్ రావుకు రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో పంటలు ఎండినా రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తాము పరిహారం ఇచ్చామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో తరుగు పేరిట రైతులను దళారులు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ చేసే విమర్శల్లో పసలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆస్తులు వెల్లడి

న్యూఢిల్లీ,సుప్రీం కోర్టు న్యాయమూర్తులు తమ తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఈ మేరకు వెబ్‌సైట్‌లో తమ ఆస్తుల వివరాలను పొందుపరిచారు. రాజకీయనాయకులు ముఖ్యంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు చేయలేని పనిని వారు చేసి ఆదర్శంగా నిలిచారు. ఏప్రిల్ 1న జరిగిన సుప్రీంకోర్టు జడ్జెస్ ఫుల్ కోర్టు మీటింగ్‌లో ఆస్తుల వివరాలు వెల్లడించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. సుప్రీం కోర్టులో మొత్తం 33 మంది న్యాయమూర్తులకుగాను 21 మంది జడ్జిలు తమ ఆస్తుల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ క్రమంలో న్యాయమూర్తుల్లో అత్యంత ధనిక న్యాయమూర్తి జస్టిస్ కె.వి విశ్వనాథన్ అని లెక్కలు చెబుతున్నాయి. ఆయన తన ఆస్తుల వివరాలను సుప్రీం కోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఇంతకీ జస్టిస్ కెవి విశ్వనాథన్ ఆస్తులు ఎంత.. అలాగే మిగిలిన జస్టిస్‌ల ఆస్తుల వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కె వి విశ్వనాథన్ సూపర్ రిచ్ అని తేలింది. సుదీర్ఘ కాలం న్యాయవాదిగా పనిచేసి అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ విశ్వనాథన్ నియమితులయ్యారు. రూ.120 కోట్ల రూపాయలు పెట్టు–బడులు పెట్టడంతో పాటు గత పది ఏళ్లుగా రూ.91 కోట్ల రూపాయలు ఆదాయపన్ను చెల్లించారు జస్టిస్. సుప్రీంకోర్టులోని మొత్తం 33 మంది న్యాయమూర్తుల్లో నిన్న (సోమవారం) అర్ధరాత్రికి సుప్రీంకోర్టు వెబ్‌సైట్స్‌లో 21 మంది న్యాయమూర్తులు తమ తమ ఆస్తుల వివరాల వెల్లడించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ కన్నాకు బ్యాంక్ అకౌంట్లో రూ.55.75 లక్షల ఫిక్స్డ్ డిపాజిట్స్ , పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో రూ. 1.06 కోట్లు– ఉన్నాయి. సౌత్ ఢిల్లీలో టూ బెడ్ రూమ్ డీడీఏ ఫ్లాట్‌తో పాటు– కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో ఫోర్ బెడ్ రూమ్ ఫ్లాట్ సంజీవ్ కన్నాకు ఉంది. కూతురితో కలిసి మరో ఫోర్ బెడ్ రూమ్ ఫ్లాట్లో 56శాతం వాటాదారుడుగా సంజీవ్ కన్నా ఉన్నారు.తదుపరి సీజేఐ కానున్న జస్టిస్ గవాయ్‌కు బ్యాంక్ అకౌంట్లో రూ.19.63 లక్షలు, పీపీఎఫ్ అకౌంట్‌లో రూ.6.59 లక్షలు ఉన్నాయి. జస్టిస్ గవాయ్‌కు అమరావతి నాగపూర్‌లో వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. మహారాష్ట్రలోని అమరావతిలో వారసత్వంగా వచ్చిన ఇల్లుతో పాటు– ముంబై, ఢిల్లీలో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. అలాగే జస్టిస్ ఓకాకు పీపీఎఫ్‌లో రూ.92.35 లక్షలు, ఫిక్స్ డిపాజిట్ల రూపంలో రూ.21.76 లక్షలు ఉన్నాయి. జస్టిస్ ఓకాకు మారుతి బలేనో కారు ఉండగా దానిపై రూ.5.1 లక్షల రుణం ఉంది.

# తెలంగాణ కులగణను అనుసరించండి

న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా కులగణన జరపడానికి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అందరి అభిప్రాయాలతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ మేరకు ఆయన మోడీకి లేఖ రాశారు. దేశంలో మొట్టమొదటిసారిగా కులగణను తెలంగా ణ ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ తెలంగాణ కులగణన నమూనాను అనుసరించాలని ఖర్గే లేఖలో మోడీ ప్రభుత్వాన్ని కోరారు. తుది కుల గణన నివేదికలో ఏదీ దాచిపెట్టవద్దని.. ప్రతి కులం యొక్క సామాజిక, ఆర్థిక డేటాను ప్రజలకు చేరువలో ఉంచాలి అని ఆయన మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రిజర్వేషన్లకు సంబంధించిన విషయంపై కూడా ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఆగస్టు 1994 నుండి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో తమిళనాడు రిజర్వేషన్ల చట్టం మాత్రమే రక్షించబడింది. అదే మాదిరిగా.. ఇతర రాష్ట్రాల చట్టాలను కూడా మన రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలి అని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, ఓబిసి రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని కూడా రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించేందుకు కులగణన సర్వే ద్వారా స్పష్టమవుతుందని ఆయన లేఖలో తెలిపారు. ఈ కులగణన సర్వే ద్వారా ప్రైవేట్ విద్యా సంస్థల్లో కూడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పించే ఆర్టికల్ 15(5)ను అమలు చేయాల్సిన అవసరం నెలకొంటు–ంది అని ఖర్గే లేఖలో పేర్కొన్నారు. న్నత విద్యా శాఖకు గ్రాంట్ల డిమాండ్లపై మార్చి 25, 2025న సమర్పించిన 364వ నివేదికలో విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ– ఆర్టికల్ 15(5)ని అమలు చేయడానికి కొత్త చట్టాన్ని సిఫార్సు చేసిందని ఖర్గే పేర్కొన్నారు.

# రేవంత్ సర్కార్‌ను చుట్టుముడుతున్న సమస్యలు



హైదరాబాద్, తెలంగాణ రోడ్డు రవాణ సంస్థ (టీజీఆర్టీసీ) ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే ఆగిపోనున్నాయి. మే 7వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్టు సంస్థ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. తమ దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కొద్ది రోజుల క్రితం తెలంగాణ రోడ్డు రవాణ సంస్థ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు తమను చర్చలకు పిలవాల్సిందిగా సమయం ఇచ్చినా యాజమాన్యం స్పందించకపోవడంతో ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. సోమవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్మిక సంఘాల నేతలను చర్చలకు ఆహ్వానించారు. సమ్మె చేయవద్దని వారిని కోరారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే లాభాల బాటలో పడుతున్నదని చెబుతూ.. కార్మికుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కానీ, ప్రభుత్వం తరపున చేయాల్సిన పనులపై స్పందించకపోవడంతో జేఏసీ నాయకులు ఆగ్రహంగా బయటకు వచ్చారు. ముందుగా ప్రకటించిన కార్యాచరణ ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గేది లేదని, ముందుకు వెళ్తామని ఆయనకు స్పష్టం చేశారు. సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి బస్సు భవన్ వరకు కవాతు నిర్వహించారు. పోలీసులు ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున మోహరించి నిలువరించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్మికులు, ఉద్యోగులు బస్‌భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉద్యోగులు సమ్మెకు దిగితే పరిస్థితి ఏంటనే దానిపై ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పాటు చర్చలకు పిలిచేందుకు మంత్రి వర్గ ఉపసంఘం వేయాల్సిన ఆవశ్యకత ఉందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

మే 15 నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు రంగంలోకి

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న ఉదాసీనత, అలసత్వం 13 లక్షల 31 వేల కుటుంబాలను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్యకార్యచరణ సమితి (టీజీఈ జాక్) చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకు తోడు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు కూడా ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఏడాదిన్నర కాలంగా వేచి చూస్తున్నామని, ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని ఆగ్రహంతో ఉన్న వీరు ఆదివారం నాడు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశమయ్యారు. కొత్త ప్రభుత్వం అని ఇప్పటి వరకు ఓపిక వహించామని, సహనం నశించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్యకార్యాచరణ సమితి సదస్సులో ప్రకటించారు. సమితి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావుతో పాటు వివిధ సంఘాల నాయకులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మే నెల 15న హైదరాబాద్ తో పాటు జిల్లాల్లో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు చేపడ్తామని తెలిపారు. వర్క్ టూ రూల్, మానవ హారాలు, సామూహిక భోజనాలు, పెన్ డౌన్, సామూహిక సెలవులు పెట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. అప్పటికీ విన్పించుకోనట్లయితే జూన్ 9న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా, ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు పాలకులు మారుతుంటారని, ఉద్యోగులు శాశ్వతంగా ఉంటారని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎంత వరకైనా వెళ్తామని సదస్సులో పాల్గొన్న నేతలు స్పష్టం చేశారు. తెలంగాణ సమాజం ఎల్లకాలం ఏ అణచివేతను, సాచివేతను, ఆగచాట్లను అవమానాలను భరించిన చరిత్ర లేదని జేఏసీ నాయకులు వెల్లడించారు. అయితే సోమవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, ఒకటో తేదీన జీతాలు ఇస్తున్న కాంగ్రెస్ సర్కార్ కు సహకరించాల్సింది పోయి సమరం చేస్తారా అంటూ మండిపడ్డారు. తనను కోసినా సరే రాబడికి మించి ఒక్క పైసా అదనంగా ఖర్చు చేయలేనని స్పష్టం చేయడాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు.

సహకరించినందుకు ఇదా?

ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలకు సహకరించి, సంయమనంగా ఉన్నందుకా ఈ వ్యాఖ్యలు అని సచివాలయం ఉద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఇలాంటి అహంకారపూరిత మాటలు మాట్లాడి ప్రజల చేతుల్లో చిత్తుగా ఓడిపోయిందని, ఇలాగే మాట్లాడితే ఈ ప్రభుత్వానికి నూకలు చెల్లినట్లేనని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. పదవీ విరమణ చేసిన తరువాత కూడా ఉద్యోగికి రావాల్సిన బకాయిలు ఇవ్వకపోతే ఎలా బతకాలంటున్నారు. జీపీఎఫ్ నిధులను కూడా ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్ లో పెడుతూ సచివాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని అంటున్నారు.

# ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు సంచలన తీర్పు..

హైదరాబాద్, ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. కేసులో ఐదుగురిని దోషులుగా తేల్చింది. ఇద్దరిని నిర్ధోషులుగా ప్రకటించింది. ఏ1 బీ.వీ.శ్రీనివాసరెడ్డి, ఏ2 గాలి జనార్ధన్‌రెడ్డి, ఏ3 గనుల శాఖ డైరక్టర్ వీడీ రాజగోపాల్, ఏ4 ఓఎంసీ కంపెనీ, జనార్ధన్ రెడ్డి పీఏ ఏ 7 అలిఖాన్ లను కోర్టు దోషులుగా ప్రకటించి శిక్షలు ప్రకటించింది. శ్రీనివాస్ రెడ్డి, జనార్ధన్ రెడ్డితో పాటు ఐదుగురు నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. కేసులో అప్పటి మైనింగ్ శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు మాజీ ఐఏఎస్ కృపానందంలను నిర్ధోషులుగా ప్రకటించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2009లో ఓఎంసీ కేసు నమోదు, 2011లో గాలి జనార్ధన్ రెడ్డిని అరెస్టు చేసిన సీబీఐ 2012లో చార్జిషీట్ దాఖలు చేసింది. 16ఏళ్ల తర్వాతా ఈ కేసులో తీర్పు వెలువడింది. కేసులో కీలక నిందితురాలుగా ఉన్న ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిపై అభియోగాలను గతంలో హైకోర్టు కొట్టివేసింది. ఇప్పుడు అనాటి మంత్రి సబితాఇంద్రారెడ్డికి క్లీన్ చీట్ ఇచ్చింది. ఈ కేసులో మొత్తం 9మందిని నిందితులుగా చేర్చింది. మరో అధికారి ఏ5 లింగారెడ్డి కేసు విచారణ దశలోనే చనిపోయారు. శ్రీనివాస్ రెడ్డి గాలి జనార్ధన్ రెడ్డి వ్యాపార భాగస్వామిగా ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో జనార్ధన్ రెడ్డి నాలుగేళ్ల శిక్ష అనుభవించారు. తను చేసిన సేవా కార్యక్రమాలు, వయసు..కంపెనీలు, ఉద్యోగ బాధ్యతల నేపథ్యంలో శిక్ష తగ్గించాలని జనార్ధన్ రెడ్డి చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. కోర్టు తీర్పు అనంతరం నిందితులను జైలుకు తరలించనున్నారు. 244మంది సాక్ష్యులను విచారించి తీర్పు వెలువరించింది.

పన్నెండేళ్ల వేదనకు కోర్టు తీర్పుతో ఉపశమనం: సబితా ఇంద్రారెడ్డి




ఓబుళాపురం మైనింగ్ కేసులో ఏ తప్పు చేయకపోయినా కోర్టు మెట్లు ఎక్కానని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా అవినీతి పరురాలు అంటూ ప్రచారాలు చేశారని..చేయని తప్పుకు పన్నెండున్నర ఏళ్ళు అనేక అపవాదులు భరించానన్నారు. ఆలస్యమైనా న్యాయస్థానాలు నాకు న్యాయం చేశాయని సంతోషం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థ ద్వారా న్యాయం కలుగుతుందని నమ్మాను న్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. ఎన్ని అపవాదులు వచ్చినా నా నియోజకవర్గ ప్రజలు అండగా నిలిచారన్నారు. ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. 15 ఏండ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్ధోషులుగా ప్రకటించింది. ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి క్లీన్ చీట్ ఇచ్చింది.

# తెలంగాణ కాంగ్రెస్ సర్కార్‌లో అటకెక్కిన నామినేటెడ్ పదవుల భర్తీ



హైదరాబాద్, ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అయిపోయింది.. అయినా.. కొందరు కాంగ్రెస్ నాయకుల కలలు మాత్రం నెరవేరడం లేదు. దాదాపు పదేళ్లు బీఆరెస్ పాలనలో ఇబ్బందులు పడ్డ నాయకులు తమకు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కకపోయినా.. కనీసం నామినేటెడ్ పోస్ట్ అయినా దక్కుతుందని ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు మహా సంబురపడ్డారు. తమ కష్టానికి అంతో ఇంతో ఫలితం దక్కుతుందని, తమ స్థాయిని బట్టి పదవులు లభిస్తాయనే గంపెడాశతో ఉన్నారు. గతేడాది మార్చి నెలలో నెలలో కొందరికి చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇచ్చారు. ఆ తరువాత నుంచి నామినేటెడ్ పదవుల జాతర ఉంటుందంటూ ఊరిస్తున్నారేకానీ.. ప్రకటించడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో నామినేటెడ్ పదవులు ఇవ్వకుండా మురగబెట్టారు. ఆ తరువాత కార్యకర్తల విశ్వాసం, అధికారం కూడా కోల్పోయింది.

మార్చి 10 దాటిపోయింది..

ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టింది. పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు నానా ఇబ్బందులు పడ్డారు. నియంతృత్వ పాలన, కేసీఆర్ కుటుంబ పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించడం, బేగంపేటలో ప్రగతి భవన్ గడీలను బద్దలు కొట్టడంతో కార్యకర్తలు తమ దశ తిరిగిందనుకున్నారు. తొలి విడతగా కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మార్చి 10వ తేదీ లోపు పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు ఇచ్చి సముచితంగా గౌరవిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాని మార్చి నెల దాటి ఏప్రిల్ వచ్చినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మే 10వ తేదీ కూడా సమీపిస్తున్నది. అంతకు ముందు పీసీసీ అధ్యక్షుడు బీ మహేశ్ కుమార్ గౌడ్ జనవరి నెలాఖరు కల్లా ప్రకటిస్తామని, ఏఐసీసీ నాయకులతో కూడా చర్చిస్తున్నామని చెప్పారు. జిల్లా కాంగ్రెస్ కమిటీల నుంచి ఆశావహుల జాబితా, పార్టీ కోసం శ్రమించిన వారి పేర్లను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) సేకరించింది. పార్టీ కోసం పనిచేస్తున్న వారికి కచ్చితంగా అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా సమావేశాల్లో స్పష్టం చేస్తూ వస్తున్నారు. తమ ప్రతిపాదనలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు పీసీసీ అధ్యక్షుడికి కూడా పంపించారు.

టికెట్ దక్కనివారి ఆశలు

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ టికెట్ ఆశించి భంగపడిన వారు తమకు చైర్మన్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. పార్టీ గెలవాలనే లక్ష్యంతో చివరి నిమిషంలో టికెట్ దక్కని వారు తమ తమ స్థాయిలో ప్రయత్నాలు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి జంప్ అయిన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఆశావహులు ఉన్నారు. ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా తమకు పదవి ఇవ్వాల్సిందేనని పట్టబడుతున్నారు. వీరే కాకుండా గాంధీ భవన్ లో అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు కూడా తమకు అవకాశం కల్పించాలని ఢిల్లీ స్థాయిలో ఒత్తిడి పెంచుతున్నారు.

రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు

ప్రస్తుతం రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్పొరేషన్ చైర్మన్‌తోపాటు డైరెక్టర్ పోస్టులు, జిల్లా చైర్మన్ పోస్టులు భర్తీ కాకుండా ఖాళీగా ఉన్నవి ఎన్నో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చిన్న, పెద్ద కలుపుకొని మొత్తం వంద వరకు కార్పొరేషన్ చైర్మన్ పోస్టులు భర్తీ చేసే అవకాశం ఉన్నది. ఇందులో 37 వరకు గతేడాది మార్చి నెలలో భర్తీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో పలువురు మహానంద పడ్డారు. లోక్ సభ ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో పదవీ బాధ్యతల స్వీకారం జూలై నెలకు వాయిదా పడింది. చైర్మన్ పదవులు పొందిన వారిలో ఓసీలు 18, బీసీ లు 11, ఎస్టీలు ముగ్గురు, ఎస్సీ ఒకరు ఉన్నారు. కాని తొలి విడత పదవుల భర్తీ జరిగి ఏడాది అవుతున్నా ఇంత వరకు మలి జాబితాను ప్రకటించలేదు. అప్పుడు ఇప్పుడు అంటూ ఆరు నెలలుగా వాయిదాలు వేస్తూ వస్తున్నారు. మధ్య మధ్య ఒకరిద్దరిని నియమించడం జరిగింది కాని భారీ సంఖ్యలో నామినేటెడ్ పదవులను భర్తీ చేయడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రావణం వెళ్లిపోయింది,దసరా,దీపావళి అన్నారు. ఈ లోపు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కూడా పూర్తయినా నియామకాలు జరగడం లేదు.అయితే కులాల మధ్య సమతూకం పాటించలేదని, జనాభా దామాషా ప్రకారం అయినా ముమ్ముందు భర్తీ చేయాలని అధిష్టానం పెద్దలకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్, రైతు బంధు సమితి, బేవరేజెస్, మార్క్ ఫెడ్, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, లెదర్ ఇండస్ట్రీ,ఇండస్ట్రీ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ ఇన్ ఫ్రా వంటి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా స్థాయిలో గ్రంథాలయ సంస్థ, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు కూడా ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయడం లేదు.

# హీటెక్కిస్తున్న కులగణన రాజకీయం!

న్యూఢిల్లీ,కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయం చుట్టూ రాజకీయం హీటెక్కుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ మధ్య క్రెడిట్ వార్ నడుస్తుండగా, దీనిని ఎన్నికల్లో ఎలా ప్లస్ పాయింట్ గా మార్చుకోవాలన్న విషయంపై రెండు పార్టీలూ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. నిజానికి నార్త్ ఇండియా దగ్గర్నుంచి సౌత్ ఇండియా వరకూ కులాల ఆధారంగానే ఎన్నికలు జరుగుతుంటాయి. క్యాస్ట్ పాలిటిక్స్ గెలుపోటములపై ఎఫెక్ట్ చూపుతుంటాయి. ఇప్పుడు ఈ కులగణన మైలేజ్ తమ ఘనతే అని చెప్పుకునేందుకు జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బీజేపీ పోటీ పడుతున్నాయి. కులగణనకు తెలంగాణ దేశానికే రోల్ మోడల్ అని కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేసుకుంటోంది. సీడబ్ల్యూసీలోనూ తెలంగాణ మోడల్ నే కేంద్రం పరిగణలోకి తీసుకుని జనాభా లెక్కల సమయంలో ఉపయోగించాలని తీర్మానించింది. అయితే ఇది బీజేపీకి ఏమాత్రం రుచించడం లేదు. అసలు రాష్ట్రాలకు కులగణన చేసే హక్కే లేనప్పుడు, అది చట్టబద్ధమే కానప్పుడు.. దాన్నెలా రోల్ మోడల్ గా తీసుకోవాలని బీజేపీ ప్రశ్నిస్తోంది. తాము ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తేగానీ, ఇన్నాళ్లూ కులగణనపై నిర్ణయం తీసుకోని బీజేపీ ఇప్పుడు నిర్ణయం తీసుకుని రాజకీయం చేయడమేంటని కాంగ్రెస్ గరమవుతోంది. కులగణన, సర్వేకు మధ్య తేడా ఏంటో అందరికీ వివరించాలని, ఇందులో కాంగ్రెస్ చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ ప్రచారం చేసేందుకు డిసైడ్ అయింది. కులగణన క్రెడిట్ ఏ మాత్రం హస్తం పార్టీకి వెళ్లకుండా ఇప్పటి నుంచే బీజేపీ జాగ్రత్తలు తీసుకుంటున్నది. అసలు ఉన్నట్లుండి కేంద్రమంత్రి వర్గం కులగణన చేయాలని నిర్ణయించడం వెనుక కారణాలు ఏమై ఉంటాయన్న చర్చ కూడా పెరుగుతోంది. ఈ ఏడాది అక్టోబర్ నవంబర్ లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. నిజానికి అక్కడ కుల రాజకీయాల జోరు చాలా ఎక్కువగా ఉంటుంది. 2023లో కుల గణన జరిపి, దాని ఆధారంగా రిజర్వేషన్ కోటాను పెంచే ప్రయత్నం చేసినా కోర్టుల్లో అడ్డుకట్ట పడింది. దీంతో సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అన్న తమ నినాదానికి కులగణనతో పరిపూర్ణత



చేకూరుతుందని బీజేపీ లెక్కలు వేసుకుంటోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆర్జేడీ పై పై చేయిసాధించాలంటే ఇంతకు మించి ప్లాన్ చేయాల్సిన పరిస్థితి. బిహార్‌లో 36% అత్యంత వెనుకబడిన వర్గాలు , 27.1% మంది %దీజ%లు ఉన్నారని, 2023 కులగణన వెల్లడించింది. అటు 2027లో జరిగే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కులగణన చుట్టూ గేమ్ నడిపేలా పొలిటికల్ పార్టీల వ్యవహారం నడుస్తోందంటున్నారు. సో క్యాస్ట్ సెన్సస్ ఆధారంగా బీజేపీ ఎన్ని ప్లాన్లు వేసినా.. తెలంగాణలో కులగణన చేసి నిజాయితీ, చిత్తశుద్ధి నిరూపించుకున్నామన్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ అన్ని రాష్ట్రాల్లో ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఈ విషయంలో తామే నిజాయితీతో ఉన్నామంటున్నారు. సో కులగణన అజెండా కులమే బలంగా మారుతున్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో రాబోయే కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బిగ్ ఇంపాక్ట్ చూపేందుకు రెడీ అవుతోంది. అయితే ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపుతారన్నదే ఇప్పుడు హాట్ డిబేట్. కులగణన విషయంలో ఏ పార్టీని ఎక్కువగా నమ్ముతారన్న విషయంపైనే విజయావకాశాలు ఆధారప డ బోతున్నాయ్.

# జనార్ధన్‌రెడ్డి అంత ఈజీగా దొరకలేదు: జేడీ లక్ష్మీనారాయణ



హైదరాబాద్,ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అధిపతి, మాజీ మంత్రి గాలి జనార్ధన్‌రెడ్డి సహా మరికొందరికి తాజాగా నాంపల్లిలోని సీబీఐకోర్టు 7 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ క్రమంలో ఈ కేసును ప్రతిష్టాత్మకంగా విచారించిన .. నాటి సీబీఐ జాయింట్ డైరెక్టర్.. వీవీ లక్ష్మీనారాయణ, ఉరఫ్ జేడీ లక్ష్మీనారాయణ తాజాగా నాటి అనుభవాలను.. కేసు విచారణకు సంబంధించిన కీలక విషయాలను ఓ మీడియా సంస్థతో పంచుకున్నారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. గాలి జనార్ధన్‌రెడ్డి అంత ఈజీగా తమకు దొరకలేదని వివరించారు. ఆయనను అరెస్టు చేయకుండా.. అనేక వ్యవస్థలు తమపై ఒత్తిడి పెంచాయన్నారు.“అసలు కేసు నమోదైన తర్వాత..ఎటు నుంచి విచారణను ప్రారంభించాలన్నది పెద్ద ప్రశ్న. దీనిని ఛేదించేందుకు సమయం పట్టింది. పైగా కొన్ని కీలక వ్యవస్థలు.. ఆయన వెనకే ఉన్నాయి. ఈ సమయంలో ఎలా విచారణ ప్రారంభించాలో కూడా మాకు అర్థం కాలేదు” అని జేడీ వివరించారు. మైనింగ్ కేసు రెండు రాష్ట్రాలకు సరిహద్దుల్లో ఉందని.. దీంతో అటు వైపు అధికారులు, ఇటు వైపు అధికారులు కూడా సహకరించాలని, కానీ, ఈ విషయంలో అధికారులు సహకరించడం తలకు మించిన పనిగా మారిందన్నారు. కీలక అధికారులు తాము విచారణకు వస్తున్నామని తెలిసి సెలవులపై వెళ్లిపోయేవారని చెప్పారు.‘సీబీఐ అధికారులమని చెబితే.. గాలి జనార్ధన్‌రెడ్డి మనుషులు తమను అడ్డుకునే ప్రయత్నం చేస్తారని భావించాం. అందుకే.. ఐటీ అధికారులమని చెప్పి.. కేవలం తనిఖీల కోసమని చెప్పి వెళ్లి ఆయనను అరెస్టు చేశాం. అంతేకాదు.. ఆయన అరెస్టు అయ్యారన్న వార్తను అత్యంత గోప్యంగా ఉంచాం. ఈ విషయంలో ఎన్నో ఇబ్బందులు కూడా పడ్డాం. మా ఫోన్లను పక్కన పెట్టేశాం. అరెస్టు తర్వాత.. మాకు బెదిరింపులు వస్తాయని కొందరు అన్నారు. కానీ.. పక్కా ఆధారాలతో కేసును ఫైల్ చేశాం” అని వివరించారు.

## మనీలాండరింగ్ కేసులో భారతీయ బిలియనీర్‌కు ఐదేళ్ల జైలు

దుబాయ్,మనీలాండరింగ్ కేసులో దుబాయ్‌లో నివసిస్తున్న భారతీయ బిలియనీర్ బల్విందర్ సింగ్ సాహ్నికి అక్కడి కోర్టు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. షెల్ కంపెనీల నెట్‌వర్క్ ద్వారా మిలియన్ దిర్హామ్‌లను లాండరింగ్, అనుమానస్పద లావాదేవీలకు పాల్పడినందకు బల్విందర్‌కు ఈ శిక్షపడింది.

# నట్టేట ముంచిన అకాల వర్షం

వరంగల్,పలు జిల్లాల్లో సోమవారం రాత్రి, మంగళవారం కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులు రైతులను నట్టేట ముంచాయి. జనగామ, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సోమవారం రాత్రి గాలివానకు పంటలకు నష్టం వాటిల్లింది. మామిడి కాయలు రాలిపోయాయి. కల్లాలు, మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల సుమారు రెండు గంటలకు పైగా వీచిన బలమైన గాలులకు జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్లు, రైస్ మిల్లుల పైకప్పు రేకులు ఎగిరిపోగా, షెడ్లు, గోడలు కూలిపోయాయి. హన్మకొండ జిల్లా భీమదేవర పల్లిలో అత్యధికంగా 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఖమ్మం జిల్లాలో పలుచోట్ల మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో వాతావరణం వేడిగా ఉండగా సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకున్నాయి. భారీ వర్షంతో రోడ్లు మునిగిపోయాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు పడిపోయాయి. జిల్లాలో వైరా కొణిజర్ల, ఏన్కూరు, ముదిగొండ, ఖమ్మం రూరల్ తదితర మండలాల్లోనూ భారీగా వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచిపోయింది. వైరాలో చెట్లు నేలకూలాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎదులాబాద్ కొనుగోలు కేంద్రంలోని ధాన్యమంతా పక్కనే ఉన్న కాలువలోకి కొట్టుకుపోయింది. తూకమేసిన ధాన్యం బస్తాలు సైతం తడిసిపోయాయి. ఉదయం రైతులు కాలువలో నుంచి ధాన్యాన్ని తీసి ఆరబెట్టుకున్నారు. ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేందుకు అధికారులు లారీలను ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.రంగారెడ్డి జిల్లా ఎదులాబాద్, మాధారం కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోందని తెలిపారు. కాగా, కొన్ని జిల్లాల్లో బుధ, గురువారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు వర్షం కురిసే



అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, ములుగు, భూపాలపల్లి, పెద్దపల్లి, యాదాద్రి, జనగామ, మంచిర్యాల, ఆసిఫాబాద్, నల్గొండ, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కొన్నిచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపింది. కాగా, మంగళవారం నిజామాబాద్ జిల్లా మెండోరాలో అత్యధికంగా 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబాబాద్‌కు చెందిన తునికి అమరావతి (40) అనే మహిళ వడదెబ్బతో సోమవారం అర్ధరాత్రి మృతిచెందింది.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. మార్కెట్ తీసుకొచ్చిన ధాన్యాన్ని తేమ శాతం ఎక్కువగా ఉందంటూ వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో కోపోద్రిక్తులైన రైతులు మార్కెట్ గేటును మూసివేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com